KANCHARLA

# మనసులో మాట


నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం..

సంచలన తెలుగు దిన పత్రిక

## రాయలసీమ

| | | |
|---|---|---|
| చిత్తూరు | అన్నమయ్య | అనంతపురం |
| కర్నూలు | కడప | నెల్లూరు |

బుధవారం 26 ఆగస్టు 2026 పేజీలు 16

మల్ల విజయ ప్రసాద్

# "వెల్ఫేర్" దగాకోర్

## ఆర్థిక మోసాలే లక్ష్యంగా ఆవిర్భావం

- దొరికిన కాడికి దోచుకో .. దాచుకో లక్ష్యంగా పయనం
- ఖాతాదారులకు కుచ్చుటోపీ .. డైరెక్టర్లకు రాజభోగాలు
- ఆకర్షణీయమైన పథకాలతో అడ్డగోలు దోపిడీ
- విలాసవంతమైన జీవితం .. ఏజెంట్లకు కానరాని వైనం
- అవినీతి, అక్రమం లక్ష్యంగానే వెల్ఫేర్ ఎండి పయనం
- మోత మోగుతున్న కేసులు
- ఈడీ దర్యాప్తుతో వెల్లడైన అవినీతి లీలలు

**(విశాఖపట్నం - మనసులో మాట) :** మల్ల విజయ ప్రసాద్‌కు చెందిన వెల్ఫేర్ గ్రూప్ సంస్థలపై గతంలో కొన్ని ఆర్థిక లావాదేవీలకు చెందిన అక్రమాల ఆరోపణలు వచ్చాయి. దీనికి సంబంధించి ఆగస్టు 2026 లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు విశాఖపట్నం, హైదరాబాద్‌లలోని ఆయన నివాసాలు, కార్యాలయాలలో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. మల్ల విజయ ప్రసాద్‌కు చెందిన వెల్ఫేర్ బిల్డింగ్ అండ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (డబ్లుబిఇపిఎల్) సంస్థలో భారీ స్థాయిలో ఆర్థిక అక్రమాలు జరిగినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరియు సీబీఐ దర్యాప్తులో వెల్లడైంది. చట్టపరమైన నిబంధనలను ఉల్లంఘించి ప్రజల నుండి రూ. 2,000 కోట్ల కంటే ఎక్కువ డిపాజిట్లను

..మిగతా 16లో

మల్ల విజయ ప్రసాద్ విశాఖపట్నం రాజకీయాల్లో గుర్తింపు పొందిన ప్రముఖ రాజకీయ నాయకుడు, వ్యాపారవేత్త మరియు సినిమా నిర్మాత. మల్ల విజయ ప్రసాద్ తన రాజకీయ ప్రస్థానాన్ని కాంగ్రెస్ పార్టీ ద్వారా ప్రారంభించారు. 2009 ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గంనుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రాష్ట్ర విభజన అనంతరం ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరపున విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుండి పోటీ చేసినప్పటికీ, టీడీపీ అభ్యర్థి గణబాబు (పి.జి.వి.ఆర్. నాయుడు) చేతిలో ఓటమి పాలయ్యారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ఆయనకు ఆంధ్రప్రదేశ్ విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపిఇడబ్లూఐడిసి) చైర్మన్‌గా కీలక బాధ్యతలు అప్పగించారు. 2024 సెప్టెంబర్‌లో ఆయనను విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త (ఇన్‌ఛార్జ్)గా పార్టీ నియమించింది. ఆయన రాజకీయ ప్రస్థానం అలా సాగుతుండగా వేరొక వైపు ఆయన 'వెల్ఫేర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్' వ్యవస్థాపకులు మరియు మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. రియల్ ఎస్టేట్, రవాణా రంగాల్లో వ్యాపారాలు నిర్వహించారు. ఆయన సినీ రంగంలో నిర్మాతగా మారి 'వెల్ఫేర్ క్రియేషన్స్' బ్యానర్‌పై కొన్ని తెలుగు సినిమాలను నిర్మించారు. విశాఖపట్నంలో ఇంజనీరింగ్ మరియు డిగ్రీ కాలేజీలను స్థాపించారు. 1999లో విశాఖపట్నం కేంద్రంగా ఒక రియల్ ఎస్టేట్ కంపెనీలో కలెక్షన్ ఏజెంటుగా సాదాసీదా జీవితం కొనసాగించిన విజయ ప్రసాద్ కోట్ల రూపాయలకు అధిపతిగా, సినిమా నిర్మాతగా, ఎమ్మెల్యేగా ఎదిగి తీరు అబ్బురపరుస్తోంది. అది తెలుసుకునే ముందు ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది




## పులివెందుల ప్రజానీకానికి తాగునీరు ఇచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

**ముత్తుకూరు ఆగష్టు 25 (మనసులో మాట):** గతంలో వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండి కనీసం పులివెందుల ప్రజలకి గుక్కెడు మంచినీళ్లు కూడా ఇవ్వ లేదని నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పులివెందుల ప్రజల దాహార్తిని తీర్చేందుకై తాగునీటిని ఇవ్వడం జరిగిందని జనసేన సర్వేపల్లి నియోజకవర్గం సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం జనసేన సర్వేపల్లి నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం సాక్షాత్తు అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గమైన

..మిగతా 02లో

## జెన్ జీ యువత ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తా



మనసులో మాట

# హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహనకు ఎల్ఈడీ ప్రచార రథం ప్రారంభం

**రాయచోటి ఆగస్టు 25 మనసులో మాట :**



హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ ప్రచార వాహనాన్ని డీఎల్ఏటీఓ డా. ఎల్. రాధిక, డీసీహెచ్ఎస్ డా. లక్ష్మీ ప్రసాద్ సంయుక్తంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణ, వ్యాధిపై ఉన్న అపోహల తొలగింపు, హెచ్ఐవీ పరీక్షల ప్రాధాన్యత, చికిత్స విధానం, ప్రభుత్వ ఆరోగ్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎల్ఈడీ వాహనం ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు.హెచ్ఐవీ వ్యాప్తికి సంబంధించిన అపోహలను తొలగించడంతో పాటు, హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా వారికి సామాజికంగా, మానసికంగా అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.దిశ క్లస్టర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ టి. ఆనంద్ కుమార్ మాట్లాడుతూ హెచ్ఐవీని ముందుగానే గుర్తించి, వైద్యుల సూచనల మేరకు ఏఆర్టీ చికిత్సను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించవచ్చని తెలిపారు. పీసీఎస్ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. చెన్నారెడ్డి మాట్లాడుతూ ఎల్ఈడీ ప్రచార వాహనం ద్వారా హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణ, 959599 లక్ష్యాలు, హెచ్ఐవీ పరీక్షలు, ఏఆర్టీ చికిత్స, సురక్షిత ప్రవర్తన, అందుబాటులో ఉన్న ఆరోగ్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లువెల్లడించారు.ఈ కార్యక్రమంలో దిశ క్లస్టర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ టి. ఆనంద్ కుమార్, పీసీఎస్ఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ టి. స్వాతి, పీసీఎస్ఎస్ సిబ్బంది, ఏరియా హాస్పిటల్, ఐసీటీసీ సిబ్బంది, జనచేతన ప్రాజెక్ట్ మేనేజర్, ఎల్‌డబ్ల్యూఎస్ ఆరోగ్య కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పులివెందుల ప్రజానీకానికి తాగునీరు ఇచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్




**ముత్తుకూరు ఆగష్టు 25 (మనసులో మాట):**

గతంలో వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండి కనీసం పులివెందుల ప్రజలకి గుక్కెడు మంచినీళ్లు కూడా ఇవ్వ లేదని నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పులివెందుల ప్రజల దాహార్తిని తీర్చేందుకై తాగునీటిని ఇవ్వడం జరిగిందని జనసేన సర్వేపల్లి నియోజకవర్గం సమన్వయ కర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం జనసేన సర్వేపల్లి నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం సాక్షాత్తు అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందులకు తాగునీటిని కూడా అందించిన దాఖలాలు లేవని ఆయన తెలిపారు. నీరు ఇవ్వకపోగా కోట్ల రూపాయల నిధులు జలధార మిషన్ కింద కేంద్ర ప్రభుత్వం కేటాయించిన వాటిని వినియోగించుకోకుండా కాలయాపన చేసినటువంటి దుస్థితి గత ప్రభుత్వంలో జరిగిందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అమరజీవి పొట్టి శ్రీరాములు జలధార పేరుతో స్వచ్ఛమైన తాగునీరు పులివెందు ల ప్రజలకి 280 కోట్ల రూపాయల అంచనాల నిధులతో ఏడు మండలాలు ఐదు లక్షల 50 వేల మంది ప్రజానీకానికి దాహార్తిని తీర్చడం కోసం శ్రీకారం చుట్టి 96% పనిని పూర్తి చేయడం జరిగిందన్నారు. 2024 సంవత్సరానికి జలధార మిషన్ కి కేటాయించిన సమయం అయిపోయిన నిధులు పుష్కలంగా ఉండి ఉపయోగంలో లేకపోవడం జరిగిందన్నారు. అయితే రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించి గెలిపించిన వెంటనే పవన్ కళ్యాణ్ జలధార మిషన్ నాలుగు సంవత్సరాల పాటు కొనసాగాలని కేంద్రం నుంచి అనుమతులు తీసుకురావడం పులివెందులలో ఆగిపోయిన మెగా వాటర్ మిషన్ శ్రీ పొట్టి శ్రీరాములు జలధర ద్వారా 280 కోట్ల రూపాయలతో పూర్తి చేయడం కోసం శ్రీకారం చుట్టి పూర్తి స్థాయిలో పనిని కొనసాగించడం జరిగిందన్నారు. పవన్ కళ్యాణ్ పులివెందుల విషయంలో కులం చూడలేదు, ప్రాంతం చూడలేదు, మన ఎమ్మెల్యే ఉండాడా లేడా అనేటువంటి విషయాన్ని కూడా చూడకుండా ప్రజలకి మంచి జరుగుతుంది వారి దాహార్తిని తీర్చాలనేటువంటి ఆలోచనతో పూర్తి చేయడం జరిగిందన్నారు. కాబట్టి రాష్ట్ర ప్రజలందరూ కూడా ఒక్క విషయాన్ని గుర్తు పెట్టుకోవానీ ఆలోచించాలి ఐదు సంవత్సరాలు ప్రతిపక్షంలో ఉండి ఐదు సంవత్సరాలు అధికారపక్షంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా ఉండి మళ్ళీ కూటమీ ప్రభుత్వం గెలిచిన తర్వాత ఎమ్మెల్యేగా కూడా గెలిచినటువంటి పులివెందుల ఎమ్మెల్యే జగన్ మోహన్ రెడ్డి ఎందుకు పులివెందుల ప్రజలకు తాగునీరు అందించలేదు. అదేవిధంగా సర్వేపల్లి నియోజకవర్గంలో రెండు మండలాలకి తాగునీరు అందించేటువంటి వాటర్ ప్లాంట్ మూత వేసి కనీసం తాగునీరు కూడా అందించకుండా తొమ్మిది కోట్ల రూపాయలు ప్రజల సొమ్ము తుప్పు పట్టి పోతుంటే పట్టించుకోని వైసిపి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆయన సొంత మండలం అని చెప్పుకునే పొదలకూరు మండలంలో కూడా ఐదు రూపాయలకి 20 లీటర్ల మంచి నీళ్లు ఇచ్చే వాటర్ ప్లాంట్ మరియు ట్యాంకర్లు ఇవన్నీ కూడా ఉంటే కనీసం ఆ వాటర్ ప్లాంట్ ను కూడా గత ఐదు సంవత్సరాలు మూత ఏసి ట్యాంకర్లన్నీ కూడా తుప్పు పట్టి పోయే విధంగా చేయడం జరిగిందన్నారు. వైసిపి ప్రభుత్వానికి ప్రజలకు మంచి చేసే ఆలోచన లేదు ప్రజలు ముఖ్ కూటమి ప్రభుత్వం మంచి చేస్తుంటే ఓర్వలేనటువంటి పరిస్థితి వీటన్నిటిని కూడా దృష్టిలో పెట్టుకొని రాబోయే స్థానిక ఎన్నికలలో రాష్ట్ర ప్రజలు గ్రామపంచాయతీలలో కూటమి నాయకులను గెలిపించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడతారని మనస్ఫూర్తిగా కోరుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణి భవాని నాయుడు, వెంకటాచల మండలం నాయకులు సందూరి శ్రీహరి, పొట్లూరు సుబ్రహ్మణ్యం, మనుబోలు మండల నాయకులు శివరాత్రి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# పాముకాటుతో పాలిచ్చే ఆవు మృతి



**తొట్టంబేడు, ఆగష్టు 25 (మనసులో మాట) :**

తొట్టంబేడు మండలం చోడవరం గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బొర్రా మల్లమ్మకు చెందిన ఆవులు పంట పొలాల్లో మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు ఓ ఆవును పాము కాటేసింది. దీంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది.మృతి చెందిన ఆవు విలువ సుమారు రూ.80 వేల వరకు ఉంటుందని బాధిత కుటుంబం తెలిపింది. పాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న కుటుంబానికి ఈ ఆవే ప్రధాన ఆధారంగా ఉండటంతో, ఆవు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.కుటుంబ పోషణకు ఆధారంగా ఉన్న ఆవును కోల్పోవడంతో తాము ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయామని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం స్పందించి తగిన ఆర్థిక సహాయం అందించాలని వారు కోరుతున్నారు.

# కాంట్రాక్టు వైద్య సిబ్బంది దశలవారీ నిరసన




**ముదిగుబ్బ, ఆగస్టు 25: (మనసులో మాట):**

కాంట్రాక్టు మెడికల్, పారా మెడికల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఏపీ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా శాంతియుత నిరసనలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ముదిగుబ్బ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో రాష్ట్రం జేఏసీ నాయకుల సూచనల మేరకు వైద్య సిబ్బంది నిరసన తెలిపారు. ఆగస్టు 24 నుంచి 27 వరకు విధులకు హాజరవుతూనే నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆగస్టు 28, 29 తేదీల్లో భోజన విరామ సమయంలో నిరసనలు, ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 1 వరకు ఆన్‌లైన్ విధుల బహిష్కరణ 3వరకు పెన్‌డౌన్, 5 వరకు అత్యావసర సేవలు మినహా విధులు బహిష్కరణ నిరసన కార్యక్రమంలో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 6న ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద, 7న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రాకపోతే సెప్టెంబర్ 8 నుంచి జేఏసీ నిర్ణయం మేరకు విధుల బహిష్కరణకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ముదిగుబ్బ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి మరియు వైద్య సిబ్బంది మద్ధతునిస్తు నిరసన వ్యక్తం చేసారు. .

మనసులోమాట

## పలమనేరు రేంజ్‌లో డ్రోన్ ద్వారా 6,000 విత్తన బంతుల వెదజల్లే కార్యక్రమం



**పలమనేరు 25 (మనసులో మాట):** అటవీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పలమనేరు రేంజ్, కలువపల్లి సెక్షన్ పరిధిలో వినూత్న రీతిలో డ్రోన్ సహాయంతో విత్తనపు బంతుల వెదజల్లే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వాచ్ టవర్, లోతువంక ప్రాంతం (కంపార్ట్‌మెంట్ నెం. 295, మోర్దానా రిజర్వ్ ఫారెస్ట్, ఎం.కోటూరు బీట్) నల్లగట్టు ప్రాంతం (కంపార్ట్‌మెంట్ నెం. 304, టేకు మంద రిజర్వ్ ఫారెస్ట్, టేకు మంద బీట్) లలో సుమారు 6000 విత్తనపు బంతులనుడ్రోన్ ద్వారా వెదజల్లారు.ఈ సందర్భంగా అధికారులుమాట్లాడుతూ.అడవుల పునరుద్ధరణ,పచ్చదనం పెంపుదల జీవవైవిధ్య పరిరక్షణలో భాగంగా, వర్షాకాలాన్ని సద్వినియోగం చేసుకుని ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. డ్రోన్ టెక్నాలజీ వల్ల మనుషులు చేరుకోలేని కష్టతరమైన ప్రాంతాల్లో కూడా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో విత్తనాలు వెదజల్లడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చంప్లా నాయక్, సెక్షన్, బీట్ అధికారులు రమేష్, సుకుమార్, యుగంధర్, శ్రీలక్ష్మి,అటవీ శాఖ సిబ్బంది, కాలపల్లి హై స్కూల్ విద్యార్థులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే గేట్ల వద్ద ఫ్లైఓవర్లు నిర్మించాలి



**ముదిగుబ్బ, ఆగస్టు 25: (మనసులో మాట)**

ముదిగుబ్బ-కదిరి మార్గంలోని 42వ రైల్వే గేట్‌తో పాటు ముదిగుబ్బ-పుట్టపర్తి ఆర్అండ్‌బీ రహదారిలోని రైల్వే గేట్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించి, ప్రజలకు రాకపోకల ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ నేషనల్ హైవే అధికారులకు నాయకులు వినతిపత్రం అందజేశారు. నేషనల్ హైవే రీజినల్ ఆఫీసర్ కేశక్రాంత్ సింగ్‌ను కలిసి వినతిపత్రం అందించిన నాయకులు, రైల్వే గేట్ల వద్ద తరచూ వాహనాలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ముఖ్యంగా అత్యవసర సమయాల్లో రైల్వే గేట్లు మూసివేయడంతో ప్రయాణికులు, గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం ఆయా ప్రాంతాల్లో ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని నేషనల్ హైవే అధికారులను కోరారు. మండల ప్రజలు, గ్రామస్తుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు సోమల ప్రకాష్ నాయుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రైతు కార్యదర్శి భాషను రమేష్ బాబు, వేలూరు సూర్యనారాయణ, పసుపులేటి వెంకటేష్, శివకుమార్, దేసునారాయణ, నాగభూషణ, లక్ష్మీనారాయణ తదితర నాయకులు పాల్గొన్నారు.

# స్టాంప్ పేపర్లు లేక ప్రజల అవస్థలు

**శ్రీకాళహస్తి, ఆగష్టు 25 (మనసులో మాట):** శ్రీకాళహస్తి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు స్టాంప్ పేపర్ల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వారం రోజులుగా రూ.10, రూ.20, రూ.50, రూ.100 విలువైన స్టాంప్ పేపర్లు అందుబాటులో లేకపోవడంతో వివిధ ప్రభుత్వ, న్యాయపరమైన పనుల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి పన్ను పేరుమార్పు, రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పనులు, విద్యుత్ మీటర్ పేరుమార్పు, కొత్త విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తులు, కోర్టుల్లో నకళ్లు పొందడం తదితర అవసరాలకు స్టాంప్ పేపర్లు తప్పనిసరిగా ఉండటంతో ప్రజలు పనులు పూర్తి చేసుకోలేక పోతున్నారు. స్టాంప్ పేపర్ల కోసం పలుచోట్ల తిరగాల్సి వస్తోందని, అయినప్పటికీ లభించకపోవడంతో సమయం, డబ్బు వృథా అవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ వివిధ పనుల కోసం కార్యాలయాలకు వచ్చే సామాన్య ప్రజలకు స్టాంప్ పేపర్ల కొరత మరింత ఇబ్బందికరంగా మారింది. ముఖ్యంగా



అత్యవసరంగా రిజిస్ట్రేషన్లు, విద్యుత్ సంబంధిత పనులు, కోర్టు వ్యవహారాలు పూర్తి చేసుకోవాల్సిన వారు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.ఈ సమస్యపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అన్ని విలువల స్టాంప్ పేపర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని శ్రీకాళహస్తి పట్టణ ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు. స్టాంప్ పేపర్ల కొరతను తక్షణమే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## శ్రీకాళహస్తీశ్వరుడ్ని దర్శించుకున్న ఎస్వీబీసీ చైర్మన్ శ్రీధర్ వర్మ





- ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డితో మర్యాదపూర్వక భేటీ..!

**శ్రీకాళహస్తి, ఆగస్టు 25 (మనసులో మాట) :** శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానెల్ (ఎస్వీబీసీ) నూతన చైర్మన్‌గా నియమితులైన శ్రీధర్ వర్మ మంగళవారం శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానాన్ని దర్శించుకున్నారు. స్వామివారి, అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక దర్శనం చేసుకున్న అనంతరం ఆలయ వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీధర్ వర్మకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అభినందనలు తెలిపారు. అంతకుముందు శ్రీధర్ వర్మ ఉరందూరు గ్రామంలోని మాజీ మంత్రి, స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి స్మృతి వనాన్ని సందర్శించారు. అక్కడ ఆయన సమాధి వద్ద నివాళులర్పించి, చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అందించిన సేవలను, ఆయనతో ఉన్న అనుబంధాన్ని శ్రీధర్ వర్మ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. తాను ఈ స్థాయికి ఎదగడంలో స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అందించిన సహకారం, ప్రోత్సాహం మరువలేనిదని పేర్కొన్నారు. అనంతరం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పూలబొకే అందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎస్వీబీసీ చైర్మన్‌గా ఆధ్యాత్మిక రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆకాంక్షించారు. భక్తులకు ఆధ్యాత్మిక కార్యక్రమాలను మరింత చేరువ చేయడంలో ఎస్వీబీసీ కీలక పాత్ర పోషించాలని, శ్రీధర్ వర్మ ఆధ్వర్యంలో ఛానెల్ మరింత అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీశైలం విషాద ఘటనపై మంత్రి సత్యకుమార్ యాదవ్ దిగ్భ్రాంతి

**బత్తలపల్లి, ఆగస్టు 25 (మనసులో మాట)** శ్రీశైలంలో ధర్మవరం నియోజకవర్గానికి చెందిన ఒకే కుటుంబ సభ్యులు మృతి చెందిన విషాద ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఘటనపై సమాచారం అందిన వెంటనే నంద్యాల జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. మృతదేహాల తరలింపు, అధికారిక లాంఛనాలు, బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలను ఎలాంటి జాప్యం లేకుండా అందించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "ప్రతి ఒక్కరి జీవితం ఎంతో విలువైనది. జీవితంలో ఎలాంటి సమస్య ఎదురైనా దానికి పరిష్కారం ఉంటుంది. సమస్యలను మనసులోనే దాచుకోకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు, నమ్మకమైన వ్యక్తులతో పంచుకోవాలి. కష్టకాలంలో ఒంటరిగా బాధపడకుండా ఇతరుల సహాయం తీసుకోవాలి. ఆవేశంలో జీవితాన్ని ముగించుకునేలా తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవద్దు" అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



మనసులోమాట

# అంగన్వాడి పిల్లల్లో సమగ్ర అభివృద్ధిని పెంపొందించాలి. సిడిపిఓ



**పలమనేరు ఆగస్టు 25( మనసులో మాట):** అంగన్వాడి పిల్లల్లో సమగ్ర అభివృద్ధిని పెంపొందించాలని సిడిపిఓ ఉమారాణి పిలుపునిచ్చారు. పలమనేరు జూనియర్ కళాశాల ఆవరణలో అంగన్వాడి కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారంతో ముగింపు కార్యక్రమానికి ఐసిడిఎస్ సిడిపిఓ ఉమారాణి హాజరైనట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ నజ్మా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.సిడిపిఓ ఉమారాణి శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు... 6రోజులు పాటు నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులలో నేర్చుకున్న అంశాలను ప్రతి అంగన్వాడి వర్కర్ ఆయా సెంటర్లలో తప్పనిసరిగాఅమలుపరచడానికి ప్రయత్నించాలన్నారు. అలా చేయడం వలన పిల్లల్లో జ్ఞానోదయంతో పాటు సమగ్ర అభివృద్ధి పెంపొందించడానికి అవకాశం ఉందన్నారు. ఇటువంటి విలువైన అంశాలను గుర్తుపెట్టుకుని పిల్లలకు గర్భవతులు బాలింతలకు అవగాహన కల్పించాలని కోరారు.నవ చేతన, ఆధార్ శీలా ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడం జరిగిందని వివరించారు.ఈ ట్రైనింగ్ లో పిల్లలలో జరిగే 03 సంవత్సం నుండి 36 సంవత్సరం పిల్లలలో జరిగే సమగ్ర అభివృద్ధి, మెదడు అభివృద్ధి గురించి, మదర్ ఐడియా కార్డ్స్ గురించి,ఎఫ్ ఎల్ ఎన్ గురించి,ఇంగ్లీష్ ని పరిచయం చేయడం గురించి, ప్రీస్కూల్ నమోదు శాతాన్ని ఎలా పెంచుకోవాలి. అనే విషయాలు పైన క్లుప్తంగా అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. సూపర్వైజర్ నజ్మా మాట్లాడుతూ... అంగన్వాడి వర్కర్లకు ఇలాంటి శిక్షణ తరగతులు ఎంత ఎక్కువ తీసుకుంటే అంత మంచిదని వివరించారు. అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు తెలుగు, భాషతోపాటు ఇంగ్లీష్ పదాలను కూడా ఎక్కువ నేర్పించాల్సి ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అంగన్వాడి కార్యకర్తల్లో వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించడం చిన్నారుల ఆరోగ్యం పోషణ పై అవగాహన పెంచడం. అంగన్వాడీ ద్వారా చిన్నారులు, గర్భవతులు బాలింతలు అందించే సేవలు గురించి అవగాహన కల్పించడం. ఆరోగ్యకరమైన బాల్యం బంగారు భవిష్యత్ అనే నినాదంతో ప్రతి అంగన్వాడి కార్యకర్త జ్ఞానం, సేవ భావం, బాధ్యతగా పనిచేస్తే మంచి ఫలితాలు, స్థానికులు పట్ల మంచి విశ్వాసం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివరించే అంశాలను అంగన్వాడి కార్యకర్తలు క్షుణ్ణముగా జ్ఞానోదయం చేసుకొని అంగన్వాడి కేంద్రాల్లో అమలు పరిచే విధంగా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు లీలారాణి,వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాసులు,సుజాత,డిఆర్పీలు నాగరాజు, త్రిలోక్ చందు, సతీష్, సువర్ణాచారి, కుబేర్ నాయుడు,అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# 28న కొండపేటలో శ్రీ బలరామ పూర్ణిమ మహోత్సవం

**చెన్నూరు , మనసులో మాట, ఆగస్టు ,25:**

చెన్నూరు మండలం కొండపేట రామాలయం వేదికగా ఈనెల 28వ తేదీ శుక్రవారం శ్రీ బలరామ పూర్ణిమ నిర్వహించడానికి కొండపేట శ్రీకృష్ణ మందిరం ఇస్కాన్ నిర్వాహకులు ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు, ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా శ్రీ బలరామ పూర్ణిమ నిర్వహిస్తున్నారు, సాయంత్రం 4: 40 నిమిషాలకు ఇస్కాన్ భక్తులచే నగర సంకీర్తన సాయంత్రం6:00 గంటలకు శ్రీ శ్రీ కృష్ణ బలరాముల దివ్య దర్శనం, హరే నామ సంకీర్తన, సాయంత్రం6:50 నిమిషాలకు మహా శంఖాభిషేకం, మహా పుష్పాభిషేకం, మహా హారతి తీర్థ ప్రసాద వితరణ నిర్వహిస్తారు, రాత్రి7:20 నిమిషాలకు నాటక ప్రదర్శన భగవద్గీత ప్రవచనం ఏర్పాటు చేశారు, సాయంత్రం6:20 నిమిషముల నుండి మహా అన్న ప్రసాద వితరణ 7వేలు మంది భక్తులకు ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమానికి చెన్నూరు కాజీపేట మైదుకూరు కడప కమలాపురం ప్రొద్దుటూరు ప్రాంతాల నుంచి ఇస్కాన్ భక్తులు భారీగా తరలివస్తున్నారు, ఈ కార్యక్రమాన్ని చెన్నూరు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొండపేట ఇస్కాన్ కమిటీ నిర్వాహకులు కోరుతున్నారు,



# విశ్రాంత ఉద్యోగుల సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా వి. గురురాజారావు



**పలమనేరు ఆగస్టు 25( మనసులో మాట) :**

ఈనెల 23వ తేదీ ఏలూరులో జరిగిన రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర స్థాయి ఎన్నికల్లో చిత్తూరు జిల్లాకు చెందిన గురు రాజారావు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గా నన్ను ఎంపిక చేయడానికీ నాకు సంపూర్ణ సహకారం అందించిన రాష్ట్ర,జిల్లా కార్యవర్గ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవి అనేది ఒక హోదా కాదని నాకు అప్పచెప్పిన భాధ్యతగా భావించి రాష్ట్ర సంఘం వారు నిర్దేశించిన కార్యక్రమాలను నిర్వహించుటకు మీ అందరి సహకారం వుండాలని కోరుకుంటూ రాష్ట్ర జిల్లా కార్యవర్గ సభ్యులకు, సంఘ సభ్యులకు మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.

# చిత్తూరు మాజీ కార్పొరేటర్ వసంత కుమార్ మృతికి నివాళులు



**పలమనేరు ఆగస్టు 25( మనసులో మాట) :**

చిత్తూరు మాజీ కార్పొరేటర్ మరియు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వసంత కుమార్ మృతికి పలమనేరు టీడీపీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. పలమనేరు పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద వసంత కుమార్ ఫ్లెక్సీ కి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి అనుచరుడిగా నియోజకవర్గంలోనూ తనదైన ముద్ర వేసుకున్న వసంత కుమార్ లేని లోటు భర్తీ చేయలేనిదని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని వారు కోరుకున్నారు. అనంతరం చిత్తూరులో జరిగిన వసంత కుమార్ అంత్యక్రియలకు ఇక్కడి నుంచి భారీగా తరలివెళ్లారు. ఈ సంతాప కార్యక్రమంలో నాయకులు కుట్టి, గిరి, ఖాజా, శ్రీధర్, నాగరాజు, రూపేష్, మబ్బాషా, రామ్మూర్తి నాయుడు, సురేష్, లోకేష్, చిన్నీ, సుబ్బు పర్వీన్, వీరప్ప, శ్రీనివాసులు, జనసేన నాయకులు పూల చైతన్య, నాగరాజు, రమేష్ తదితరులున్నారు.

మనసులో మాట

# 64 మంది వృద్ధులకు ఉచిత వైద్య పరీక్షలు



**ముదిగుబ్బ, ఆగస్టు 25 (మనసులో మాట):**

ముదిగుబ్బ మండలం మలకవేముల క్రాస్‌లోని అవధూత కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో మలకవేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ బి. నాగేంద్ర నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో మొత్తం 64 మంది వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో 12 మందికి బీపీ, 11 మందికి షుగర్, ఆరుగురికి రక్తహీనత ఉన్నట్లు గుర్తించారు. వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ప్రతినెలా నాలుగో మంగళవారం ఆశ్రమంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని డాక్టర్ నాగేంద్ర నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు ప్రతిరోజూ యోగా, వాకింగ్‌ను అలవాటుగా చేసుకోవాలని సూచించారు. ఆశ్రమ నిర్వాహకులుముని రామిరెడ్డి, భయపరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడుతూ వృద్ధులకు మంచి పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మంజునాథ శర్మ, మహీధర్ శర్మ, హరి స్వామి, ఆరోగ్య విస్తరణ అధికారి వేణుగోపాల్‌రెడ్డి, పీహెచ్‌ఎన్ మంజుల, ఎంఎల్‌హెచ్‌పి ఈపీఎస్ఎన్ రవిశంకర్, సీహెచ్‌ఓ డి.మీన, ఎంహెచ్‌పి కృష్ణవేణి, ఆశా కార్యకర్తలు శాంతమ్మ, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినందుకు కాశిరెడ్డి నాయన ఆశ్రమం చైర్‌పర్సన్ డాక్టర్ యు. ఆశ్రిత శంకర్ నారాయణరాజు ఆసుపత్రి సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి రూపొందించిన సీఎంఎస్ కు ప్రతిష్టాత్మక అవార్డు




**అన్నమయ్య జిల్లా బ్యూరో ఆగస్టు 25 మనసులో మాట**

ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి, రూపొందించిన వినూత్న 'కోర్టు మానిటరింగ్ సిస్టమ్' సి ఎం ఎస్ ప్రాజెక్టుకు జాతీయ స్థాయి గుర్తింపు దక్కింది. జైపూర్‌లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఎస్పీ 'టెక్నాలజీ సభా ఎక్సలెన్స్ అవార్డ్స్ 2026'ను అందుకున్నారు. కోర్టు కేసులు, నిందితుల వివరాలు, కేసు స్థితి మరియు పర్యవేక్షణ, కోర్టు సమన్లు, వారెంట్ల ప్రక్రియ డిజిటలైజ్ కావడం వల్ల కేసుల విచారణ వేగవంతమై, నేరస్థులకు సకాలంలో శిక్షలు పడేలా సి ఎం ఎస్ వ్యవస్థ ఉపయోగపడుతుందని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్

- ఏ ఒక్క అర్జీ కూడా నిర్లక్ష్యానికి గురికాకుండా చూడాలి ఎమ్మెల్యే స్పష్టం

**శ్రీకాళహస్తి, ఆగస్టు 25 (మనసులో మాట) :**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే ఉద్దేశంతో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పట్టణంలోని పంచాయతీరాజ్ భవనం (పీఆర్ గెస్ట్‌హౌస్) లో ప్రజా దర్బార్ (పబ్లిక్ గ్రీవెన్స్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ వ్యక్తిగత, స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు తమ సమస్యలను వివరిస్తూ ఎమ్మెల్యేకు వినతిపత్రాలు, అర్జీలు సమర్పించారు. ముఖ్యంగా తాగునీటి సమస్యలు, డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల మరమ్మతులు, వీధుల్లో పారిశుద్ధ్య సమస్యలు, పింఛన్లు, రేషన్ కార్డులు, రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలు, విద్యుత్, మౌలిక వసతులు, అభివృద్ధి పనులకు సంబంధించిన పలు వినతులు ఎమ్మెల్యేకు అందాయి. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని ఎమ్మె




ల్యే బొజ్జల సుధీర్ రెడ్డి స్వయంగా స్వీకరించి, వారి సమస్యలను ఓపికగా విన్నారు. సమస్యల తీవ్రత, పరిష్కారానికి అవసరమైన చర్యలపై సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలు నమ్మకంతో తమ వద్దకు వచ్చి తమ సమస్యలను తెలియజేస్తున్నందున ప్రతి అర్జీని బాధ్యతగా తీసుకుని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ప్రజా దర్బార్‌లో పాల్గొన్న వివిధ శాఖల అధికారులకు ఎమ్మెల్యే కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు సమర్పించిన వినతిపత్రాలను కేవలం స్వీకరించి వదిలివేయకుండా, వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అవసరమైన సందర్భాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిశీలించి, వాస్తవ పరిస్థితులను తెలుసుకుని త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు చొరవ చూపాలని, పింఛన్లు, రేషన్ కార్డులు తదితర సమస్యల పరిష్కారంలో అనవసర జాప్యం జరగకూడదని ఎమ్మెల్యే సూచించారు. అదే విధంగా తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి ప్రజలకు నిత్యజీవితంలో అవసరమైన మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతికి ప్రాధాన్యత ఇచ్చి, సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా పనిచేయాలని, ఏ ఒక్క అర్జీ కూడా నిర్లక్ష్యానికి గురికాకుండా చూడాలని స్పష్టం చేశారు. ప్రజా దర్బార్ ద్వారా తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చే అవకాశం లభించడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తెలిపారు.

# జెన్ జీ యువత ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తా






- 51 రోజులపాటు 51 ప్రాంతాల్లో జెన్-జీ యువతతో ఆత్మీయ భేటీలు
- దాదాపు 20 వేల మంది విద్యార్థులతో నేరుగా మమేకం
- రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

**నెల్లూరు,ప్రతినిధి ఆగస్టు 25,మనసులో మాట:**

జెన్ జీ యువత ఆకాంక్షలు, అభిప్రాయాలు, ఆలోచనలను తెలుసుకుని వాటికి అనుగుణంగా ప్రజాప్రతినిధిగా పనిచేస్తానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. 51 రోజులపాటు 51 ప్రాంతాల్లో జెన్ జీ యువతతో ఆత్మీయ భేటీలు నిర్వహించి, దాదాపు 20 వేల మంది విద్యార్థులతో నేరుగా మమేకమయ్యే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రూరల్ నియోజకవర్గం పరిధిలోని పార్థసారథి నగర్‌లో ఉన్న జెనెక్స్ కాలేజీలో మంగళవారం విద్యార్థినీ విద్యార్థులతో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆత్మీయ భేటీ నిర్వహించారు. సుమారు 1,000 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమం దాదాపు నాలుగు గంటల పాటు కొనసాగింది. ఈ సందర్భంగా విద్యార్థులతో ఎమ్మెల్యే నేరుగా సంభాషిస్తూ వారి అభిప్రాయాలు, ఆశయాలు, భవిష్యత్ లక్ష్యాలు, సమాజం పట్ల వారి ఆలోచనలను తెలుసుకున్నారు. యువత తమ సమస్యలపై ప్రశ్నించడం, అవసరమైన సందర్భాల్లో ఉద్యమించడం సమాజానికి ఎంతో అవసరమని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. అయితే ప్రశ్నించేటప్పుడు సంప్రదాయ భాషను గౌరవిస్తూ, నలుగురూ మెచ్చే విధంగా మాట్లాడటం కూడా ముఖ్యమని సూచించారు. యువతలో ప్రశ్నించే తత్వం, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు పెంపొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా యువతతో జరిగిన చర్చల్లో రాష్ట్ర రాజకీయాలు, పాలన, భవిష్యత్ అభివృద్ధి, యువతకు అవసరమైన అవకాశాలు తదితర అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. విద్యార్థులు తమ అభిప్రాయాలను, ఆకాంక్షలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వ్యవస్థలను విధ్వంసం చేసే ముఖ్యమంత్రి మాకు వద్దు. విజన్ ఉన్న నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ వంటి నాయకత్వం మాకు కావాలి అని యువత తమ అభిప్రాయాలను వ్యక్తం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. జెన్ జీ యువత ఆకాంక్షలు, మనోభావాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్తానని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి చెప్పారు.




యువతకు సంబంధించిన అంశాలను కేవలం చర్చలకే పరిమితం చేయకుండా, వాటిపై ప్రభుత్వ స్థాయిలో కూడా చర్చ జరిగేలా కృషి చేస్తానన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో యువతతో మరింత విస్తృతంగా మమేకం కావడమే లక్ష్యంగా 51 రోజులపాటు 51 ప్రాంతాల్లో ఆత్మీయ భేటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా దాదాపు 20 వేల మంది విద్యార్థులను నేరుగా కలుసుకుని వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. జెన్ జీ యువతలో ఉన్న కొత్త ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకతను సమాజ అభివృద్ధికి వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. యువత తమ లక్ష్యాల సాధనలో ముందుకు సాగేందుకు అవసరమైన ప్రోత్సాహం, అవకాశాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. జెన్ జీ యువత ఆకాంక్షలకు అనుగుణంగా నెల్లూరు రూరల్‌లో స్థానిక శాసనసభ్యుడిగా పనిచేస్తా. యువత గొంతుకను వినిపించడంతో పాటు వారి సమస్యలు, ఆకాంక్షలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా అని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి స్పష్టం చేశారు. జెనెక్స్ కాలేజీలో నాలుగు గంటల పాటు విద్యార్థులతో సాగిన ఈ ఆత్మీయ భేటీలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి విద్యార్థుల ప్రశ్నలు, అభిప్రాయాలను ఓపికగా విని వారితో నేరుగా సంభాషించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువతతో నిరంతరం మమేకమై వారి ఆలోచనలను తెలుసుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

మనసులో మాట

## అర్హత మార్కులను తగ్గించాలి మీడియా ఇంచార్జి కరెడ్ల వెంకటేశ్వర్లు



**లక్కిరెడ్డిపల్లి ఆగస్టు,25(మనసులోమాట):**

లక్కిరెడ్డిపల్లి మండలం లో మార్పులు లేకుండా స్పెషల్ టెట్ పేరుతో నోటిఫికేషన్ ప్రభుత్వం విడుదల చేయడానినీ నిరసిస్తూ జడ్పీహెచ్ స్కూల్ గర్ల్స్ లక్కిరెడ్డిపల్లి నందు నిరసన తెలియజేసిన ఉపాధ్యాయులు ఈ నిరసనలో పాల్గొన్న ఏపీ యు ఎస్ జిల్లా మీడియా ఇంచార్జి కరెడ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతం లో నిర్వహించిన టీ ఈ టీ కు ఎటువంటి మార్పులు లేకుండా స్పెషల్ టీ ఈ టీ నోటిఫికేషన్ విడుదల చేయడం దుర్మార్గమైన చర్య అని దుయ్యబట్టారు ఆగస్టు లో నిర్వహించిన టీ ఈ టీ ఫలితాలు విడుదల చేసిన తర్వాత స్పెషల్ టెట్ నోటిఫికేషన్ విడుదల చేయాలి కానీ ప్రభుత్వం తో అత్యుత్సాహంతో ముందుగానే స్పెషల్ టెట్ నిర్వహించడం విచారకరం కావున ప్రభుత్వం వెంటనే గతంలో జరిగిన టెట్ పరీక్ష ఫలితాలు విడుదల చేసి స్పెషల్ టెట్ పరీక్షలో అర్హతమార్కులను అన్ని కేటగిరీలకు 40%(60 మార్కులు ) గా నిర్ణయిస్తే ఉపాధ్యాయులందరికీ మేలు జరిగినట్లు అవుతుంది. అంతేగాక టెట్ పరీక్షను ఆన్లైన్ విధానంలో కాకుండా ఆఫ్ లైన్ విధానంలో నిర్వహించాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు వారు బోధించే సబ్జెక్టులో మాత్రమే టెట్ పరీక్షలు నిర్వహించాలని ఉపాధ్యాయినులు పేర్కొన్నారు.

## తలారివెట్టు దగ్గర రోడ్డు ప్రమాదం







**బి.ఎన్. కండ్రిగ ఆగస్టు25(మనసులో మాట)**

తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండలం తలారివెట్టు బస్టాండ్ వద్ద మధ్యాహ్నం సుమారు 2:00 గంటల సమయంలో పెద్ద పాండూరు వెంకటేశ్వర కాలనీకి చెందిన కటారి వెంకటేష్, వయస్సు 29 సంవత్సరాలు, తండ్రి పేరు వెంకటేష్, తన ఇంటి నిర్మాణం కోసం టైల్స్ కొనుగోలు చేయడానికి తన భార్య శిరీషతో కలిసి శ్రీకాళహస్తిలోని ఒక షాపుకు వెళ్లి, తిరిగి వారి స్వగ్రామమైన పెద్దపాండూరుకు మోటార్ సైకిల్ నంబర్ AP 39 M 0516పై వెళ్తుండగా, తలారిపేట బస్టాండ్ వద్దకు చేరుకున్న సమయంలో ఎదురుగా వస్తున్న కారు నంబర్ AP 16 DN 3331ను దాని డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా మరియు నిర్లక్ష్యంగా నడిపి, వారు ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్‌ను ఢీకొట్టాడు. దీంతో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న వెంకటేష్ మరియు అతని భార్య శిరీష ఇద్దరూ రోడ్డుపై కిందపడిపోయారు. అక్కడ ఉన్న స్థానికులు వెంటనే వారిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.

## నేతన్న నేస్తం 25 వేలు వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలి

- ఏపీ చేనేత కార్మిక సంఘం డిమాండ్.

**ధర్మవరం ఆగస్టు 25 (మనసులో మాట)**



నేతన్న నేస్తం పథకములో ఇంకను రాని వారి చేనేత కార్మికులకు ప్రభుత్వం వెంటనే 25వేల రూపాయలు విడుదల చేయాలని చేనేత నాయకులు జింక చలపతి, సిపిఐ నాయకులు మధు, కార్యదర్శి రవి, రమణ, చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసులు, సీనియర్ నాయకులు భుజంగం తదితరులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు కరపత్రాలను కదిరి గేటు నేతన్న విగ్రహం వద్ద విడుదల చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. స్వాతంత్రం అనంతరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక పారిశ్రామిక విధానాల ఫలితంగా కార్పొరేట్ వ్యాపారులు పెద్ద ఎత్తున సాంప్రదాయ చేతి వృత్తులలో సేవా రంగాలలో ప్రవేశించడం వల్ల చేతి వృత్తిదారుల జీవనం మరింత దుర్భరంగా మారింది అని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెం.187 ప్రకారం ఒక్కో కుటుంబానికి 25000 అయితే 51.952 మందికి 129.88 కోట్ల రూపాయలు అవుతుంది అని తెలిపారు. 2019 20 అఖిలభారత చేనేత గణన ప్రకారం రాష్ట్రంలో 1.2 లక్షల మందికి పైగా చేనేత కార్మికులు ఉన్నారు అని, 7 తేదీ జాతీయ చేనేత దినోత్సవం రోజు జీవో ఆర్ టి నెం.44 ప్రకారం 7.90 కోట్లు చేనేత కుటుంబాలకు ఇచ్చారు అని తెలిపారు. ఆగస్ట్ 20 లోపు కార్మికులందరికీ ఇచ్చేస్తామని చేనేత మంత్రి హామీ ఇచ్చినా అమలకు నోచుకోలేదు అని దుయ్యబట్టారు. చేనేత కార్మికులు ఉద్యమాలకు సిద్ధం కాక తప్పదు 28వ తేదీ ఉదయం 10.30.కి. గంటల నుండి ఆర్డీవో ఆఫీస్ ముందు ధర్నా చేపట్టడం జరుగుతున్నది అని తెలిపారు. చేనేత మిత్రులు కార్మికులు 25000 ఇంకా రాని ధర్మవరంలో చేనేత కార్మికులు అందరూ హాజరు కావలసిందిగా వారు పిలుపునిచ్చారు. చేనేత కార్మికులందరికీ ఒకేసారి 25000 బ్యాంకు ఖాతాల్లోకి వేయాలి అని, నేతన్నలకు ఎగ్గొట్టిన 202425 రెండు సంవత్సరాలు మొత్తం కూడా ప్రభుత్వం ఇవ్వాలి ఇవ్వాలి అని, కుల కార్పొరేషన్ల ద్వారా వికేంద్రీకరణ కాకుండా హ్యాండ్లూమ్ డిపార్ట్మెంట్ ద్వారా ఇవ్వాలి అని, చేనేత కార్మికుల డేటా బేస్ ను ఆన్ లైన్ లో బహిరంగపరచాలి అన్ని డిమాండ్ చేశారు. అనుబంధ చేనేత కార్మికులకు వస్త్ర తయారీలో భాగస్వామ్యం అవుతున్న కార్మికులందరికీ 25 వేలు ఇవ్వాలి అని,టెక్స్ టైల్ పాలసీ 202429 లో చేనేత రంగానికి ప్రత్యేక చాప్టర్ బడ్జెట్ కేటాయించాలి అని, జీవో.29.2019 యాక్ట్ అమలు చేయాలి అని, ఫుల్ మిక్స్ హాట్ మిక్స్ నేస్తున్న పవర్లూమ్ కార్మికులకు కూలీలు తగ్గిస్తున్న యజమానులపై చర్యలు తీసుకోవాలి అని తెలిపారు. చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు శ్రీ శ్రీనివాసులు సీనియర్ నాయకులు, భుజంగం ఇతర చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలి - యూటీఎఫ్ డిమాండ్

**ధర్మవరం ఆగస్టు 25 (మనసులో మాట)**




విద్యా హక్కు చట్టం సెక్షన్ 23(1) ను సవరించి, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్షలు రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రామకృష్ణ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టెట్ రద్దుపై యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన దశల వారీ పోరాటాల్లో భాగంగా ధర్మవరం పట్టణంలోని పొట్టి శ్రీరాములు కూడలి నందు యూటీఎఫ్ ధర్మవరం డివిజన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యుటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ అనేక సంవత్సరాల పాటు విద్యార్థులకు విద్యాబోధన చేస్తూ వారిని ఉన్నత పౌరులుగా తీర్చి దిద్దుతున్న ఉపాధ్యాయులను టెట్ పేరుతో భయభ్రాంతులకు గురి చేస్తూ వారి యొక్క బోధనపై ప్రభావం చూపేలా చేయడం సరికాదని తెలిపారు. అందువల్ల విద్యాహక్కు చట్టం సెక్షన్ 23(1) ని సవరించి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్షలను రద్దుచేసే విధంగా తమిళనాడు ప్రభుత్వం చేసిన విధంగానే మన రాష్ట్ర ప్రభుత్వం కూడా వెంటనే అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి చేయాలని అనుకుంటే ప్రభుత్వం నిన్న విడుదల చేసిన స్పెషల్ టెట్ నోటిఫికేషన్ లో ఉపాధ్యాయులందరికీ పాస్ మార్కులు 40 శాతము కి తగ్గింపు చేయాలని, ఉపాధ్యాయులు బోధించే సబ్జెక్టు వారిగా పరీక్షలు నిర్వహించే విధంగా సిలబస్ లో మార్పు చేయాలని, అదేవిధంగా సీనియర్ ఉపాధ్యాయులను దృష్టిలో ఉంచుకొని టెట్ పరీక్షను ఆన్లైన్లో కాకుండా ఆఫ్ లైన్ విధానంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రామకృష్ణ నాయక్, జిల్లా కార్యదర్శి అమర్నారాయణ రెడ్డి, ధర్మవరం పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జింక హరికృష్ణ, హెచ్ రామాంజనేయులు, సీనియర్ నాయకులు ఆంజనేయులు, రాంప్రసాద్, వెంకట కిషోర్, రఫీ అహమ్మద్, రవి శేఖర్, సాయి గణేష్, నాగిరెడ్డి, రామకృష్ణ, పెద్దకోట్ల సురేష్, వెంకట సురేష్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట

# ప్రవేటు విద్యతో పోటీపడాలి- సిడిపిఓ

**బాలాయపల్లి (మనుసులో మాట) :**



గనవాడి కేంద్రాల్లో ప్రవేటు విద్యతో పోటిపడాల ని వెంకటగిరి క్లష్టర్ స్త్రీ సంక్షేమ శాఖ అధికారి ని శంషాద్ బేగం పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగనవాడి కార్యకర్తలకు జ్ఞానజ్యోతి కార్యక్రమంలో సిడిపిఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులకు అంగనవాడి కేంద్రాల్లో చక్కన విద్యను అందిస్తూ పౌష్టికాహారం కూడా అందజేస్తున్నామన్నారు. 0 వయసు గల పిల్లలను కు పౌష్టికాహారం అందజేయడంతో పాటు వారి ఆరోగ్య సమస్యలపై ప్రత్యేకమైన దృష్టి సారించడం తరపున తెలియజేశారు. అంతేకాకుండా అంగనవాడి కేంద్రాలకు ప్రతి పిల్లవాడిని పంపించేలా కార్యకర్తల పని చేయాలన్నారు. చక్కన విద్దును అంగనవాడి కేంద్రాల ద్వారా అందిస్తున్నామన్నారు. పిల్లల యొక్క మనస్తత్వాలను బట్టి విద్య బోధన చేయాలన్నారు అవసరమైతే పిల్లలతో పాటు కార్యకర్తలు కూడా ఆటలు పాటలు పాడుతూ పిల్లలతో మమేకమై విద్యాబోధన చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి టు ప్రదీప్ కుమార్, రిసోర్స్ పర్సన్ రత్నాకర్, సూపర్వైజర్ శేషమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల మేరకు ఉచిత ఇసుకను సద్వినియోగం చేసుకోవాలి

- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**నెల్లూరు/బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 25, మనసులో మాట:**



నిర్మాణ రంగానికి, భవన నిర్మాణ కార్మికులకు, రోజువారీ కూలీలకు ప్రయోజనం కలిగేలా ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోరారు. మంగళవారం బుచ్చిరెడ్డిపాళెం లో మీడియాతో మాట్లాడుతూ ఇసుక సమస్యను భవన నిర్మాణ కార్మికులు, రియల్ ఎస్టేట్ రంగానికి చెందినవారు, రోజువారీ కూలీలు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న సమస్యపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించి, నిబంధనలకు లోబడి ఉచితంగా ఇసుక తీసుకెళ్లే అవకాశం కల్పించారని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఎమ్మెల్యే సూచించారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక తరలించుకోవాలని, ఇందుకోసం ట్రాక్టర్లు, కూలీల సాయాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. జేసీబీలు, టిప్పర్లు వినియోగించకూడద ని, రాత్రి వేళల్లో ఇసుక తవ్వకాలు జరపకూడదని స్పష్టం చేశారు. నిబంధనలు పాటిస్తే అందరికీ ప్రయోజనం కోవూరు నియోజకవర్గం లో ఉచిత ఇసుక విధానం సజావుగా అమలయ్యేలా ప్రజలంతా సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై పోలీసులు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని, అవసరమైతే అరెస్టులతో పాటు వాహనాలను సీజ్ చేస్తారని తెలిపారు. ఉచిత ఇసుక విధానం ద్వారా నిర్మాణ రంగం, కార్మికులకు ప్రయోజనం కలిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

**27 నుంచి బుచ్చిరెడ్డిపాళెంలో వీపీఆర్ నేత్ర**

పేదల కంటి చూపును రక్షించాలనే లక్ష్యంతో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలోని వీపీఆర్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న వీపీఆర్ నేత్ర ఉచిత కంటి వైద్య సేవలు ఈ నెల 27వ తేదీ నుంచి బుచ్చిరెడ్డిపాళెం శాంతినగర్‌లో ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. కోవూరు నియోజకవర్గం లోని నాలుగు మండలాల్లో ఇప్పటికే వీపీఆర్ నేత్ర సేవలు పూర్తయ్యాయని, 27వ తేదీ నుంచి బుచ్చిరెడ్డిపాళెం మండలంలోనూ సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. పార్టీలకు అతీతంగా ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉచిత కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి అక్కడికక్కడే ఉచితంగా కళ్లజోళ్లు అందజేస్తారని తెలిపారు. ఇప్పటి వరకు నెల్లూరు జిల్లాలో లక్షకు పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించగా, 65 వేలకు పైగా కళ్లజోళ్లు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. పేదల కంటి చూపును కాపాడే సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ కేవీ ప్రతాప్‌రెడ్డి జన్మదిన వేడుకలు

**శ్రీకాళహస్తి, ఆగష్టు 25 (మనసులో మాట) :**

శ్రీకాళహస్తి పట్టణ నాయకులు, టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ కేవీ ప్రతాప్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కేవీ ప్రతాప్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం కేవీ ప్రతాప్‌రెడ్డితో కేక్ కట్ చేయించి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కేవీ ప్రతాప్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



# సీనియర్ జర్నలిస్ట్ మణి కుమార్తెని ఆశీర్వదించినా పేర్నేటి శ్యాం ప్రసాద్ రెడ్డి



**వాకాడు మనసులో మాట అగస్ట్ 25**

వాకాడు మండలానికి చెందిన సీనియర్ జర్నలిస్టు మణి కుమార్తె వివాహ సందర్భంగా సోమవారం వైయస్సార్సీపి సి ఈ సి సభ్యులు పేర్నెట్ శ్యాంప్రసాద్ రెడ్డి పెళ్లి కుమార్తె ఇంటికి వెళ్లి మనపాటి సుమను ఆశీర్వదించారు. అదేవిధంగా ఫారెస్ట్ అధికారి గాయం శ్రీనివాసులు కుమారుడు అనిల్ కుమార్ ను ఆశీర్వదించి. నూతన వధూవరులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈయన వెంట రామలింగారెడ్డి, వైసిపి నాయకులు పాల్గన్నారు .

# ముగిసిన జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతులు



**ముత్తుకూరు. ఆగష్టు.25(మనసులో మాట):**

ఐసిడిఎస్ ఇందుకూరుపేట ప్రాజెక్టు పరిధిలోని ముత్తుకూరు మండలం పరిధిలోని ముత్తుకూరు, పంటపాలెం, పిడత పోలూరు సెక్టార్ల పరిధిలోని 73 అంగన్వాడి కేంద్రాల్లో పని చేస్తున్న అంగన్వాడి వర్కర్లకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని మూడు రోజులపాటు నిర్వహించడం జరిగిందని ఐసిడిఎస్ సిడిపిఓ. లక్ష్మీదేవి తెలిపారు. చివరి రోజు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో చదివే పిల్లలకు, గర్భవతులకు, పెద్దలకు అవసరమైనటువంటి జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని అంగన్వాడి వర్కర్లకు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జెండర్, ఈ క్వాలిటీ, ఆధార్, నవ చేతన గురించి వివరించడం జరిగింది. ఈ శిక్షణను ప్రసాద్, రాంబాబు లు ఇవ్వడం జరిగిందన్నారు ఈ శిక్షణతో మూడవ సంవత్సర జ్ఞాన జ్యోతి ట్రైనింగ్ ముగిసింది అని తెలిపారు. ఈ సందర్భంగా జ్ఞానజ్యోతి కిట్లను అంగన్వాడీ వర్కర్లకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి హేమ సుందర్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చల్ల శ్రీనివాసులు రెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు అమ్మనమ్మ, సుబ్బమ్మ, 73 అంగన్వాడి కేంద్రాల అంగనవాడి వర్కర్లు పాల్గొన్నారు .



మనసులో మాట
KANCHARLA

## ఫిజియోథెరపీ క్యాంపు విజయవంతం - డాక్టర్ సత్య నిర్ధారన్



**ధర్మవరం ఆగస్టు 25 (మనసులో మాట):** పట్టణంలోని 37 వార్డు నందు 25 మంది వయోవృద్ధులకు వారి మోకాళ్ళ సమస్యల ఉపశమనం కోసం ఫిజియోథెరపీ కార్యక్రమం విజయవంతం అయిందని డాక్టర్ సత్య నిర్ధారన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఎస్పి వి రాజు, లాయర్ సుమలత, పట్టణ బిజెపి అధ్యక్షుడు జింక చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు. వార్డ్ సచివాలయం ఏఎన్ఎం ఎల్ ద్వారా ఫిజియోథెరపీ చేయించడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఫిజియోథెరపిస్ట్ నజీమా, మసాజ్ నిపుణురాలు హారిక ఉచిత సేవలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమం గొడుగు వారి సంస్థ వారి ఆధ్వర్యంలో జరిగింది. ముందు ముందు పట్టణంలోని అన్ని వార్డులలో ఫిజియోతెరపి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అంతర్జాతీయ మోకాళ్ళ బాధితుల సంక్షేమ సమితి అధ్యక్షులు పుచ్చ గింజల మల్లికార్జున మాట్లాడుతూ రెండవసారి ఏర్పాటు చేసే ఫిజియోథెరపీ క్యాంపులో ఆర్థోపెడిక్ విభాగం ఇతర విభాగాల వైద్య సేవలను వయోవృద్ధులకు అందజేస్తామని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, రమణారెడ్డి, బాలాజీ నాయక్, విశ్వనాథ్, ఓబులేష్, దంపట్ల చెర్లపల్లి మాజీ సర్పంచ్ వెంగముని తదితరులు పాల్గొన్నారు.

## 28 లోపు అభ్యంతరాలు తెలియజేయాలి....ఎంపీడీవో

**బాలాయపల్లి (మనసులో మాట) :**



మండలంలోని 24 పంచాయతీలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వద్ద ఈనెల 28వ తేదీ లోపు అభ్యంతరాలు తెలియజేయాలని ఎంపీడీవో ఏవి నారాయణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ షెడ్యూల్ కులాలు షెడ్యూల్ తెగలు, వెనకబడిన కులాలకు సంబంధించిన వారు పంచాయితీ ఓటర్ల జాబితాలో ఏమైనా పొరపాట్లు ఉన్న వాటి పై అభ్యంతరాలను ఈనెల 28వ తేదీ లోపు తెలియజేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ కులాలకు చెందిన వారు గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి కి రాతపూర్వకంగా రాసి ఇవ్వాలని తెలిపారు. మంత్రాలు సేకరణలో ఎటువంటి లోపాలు జరిగిన బూతు లెవల్ అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ రెండు రోజులు ఓటర్లకు అందుబాటులో లేని వారు తమ దృష్టికి వస్తే వెంటనే వారిని సస్పెండ్ చేయడం జరిగిన హెచ్చరించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, సూపర్డెంట్ వినీల్ కుమార్ ఇతరులు పాల్గొన్నారు.

## ధర్మవరం యువతకు ఉద్యోగాల పండుగ... సెప్టెంబర్ 8న మెగా జాబ్ మేళా

- మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ కుమార్ వెల్లడి.



**ధర్మవరం ఆగస్టు 25 (మనసులో మాట)** ధర్మవరం నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు విస్తృత స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా తేదీలో మార్పు చేసినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ముందుగా ఆగస్టు 28వ తేదీన నిర్వహించాల్సిన ఈ మెగా జాబ్ మేళాను సెప్టెంబర్ 8వ తేదీ మంగళవారం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవతో, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మరియు సంస్కృతి సేవా సమితి సహకారంతో నిర్వహించనున్న ఈ మెగా జాబ్ మేళా ధర్మవరం యువతకు ఉద్యోగ అవకాశాలను నేరుగా అందించే వేదికగా నిలవనుందని పేర్కొన్నారు. ఈ మెగా జాబ్ మేళాలో 100కు పైగా ప్రముఖ జాతీయ కంపెనీలు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. వివిధ రంగాల్లోని కంపెనీలు తమకు అవసరమైన సిబ్బంది ఎంపిక కోసం అభ్యర్థులకు ప్రత్యక్షంగా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయని పేర్కొన్నారు. ఉద్యోగం కోసం యువత కంపెనీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా కంపెనీలనే ధర్మవరం యువత వద్దకు తీసుకురావడం ఈ మెగా జాబ్ మేళా ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. ధర్మవరం నియోజకవర్గంతో పాటు సమీప ప్రాంతాల నుంచి అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాకు 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, బి.ఫార్మసీ, డి.ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ, బీటెక్, పీజీ తదితర విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు హాజరుకావచ్చని తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన అభ్యర్థులు ఈ ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 8వ తేదీన ఉదయం 9 గంటలకు ధర్మవరం-బత్తలపల్లి రోడ్డులోని సి ఎన్ బి ఫంక్షన్ హాల్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు హరీష్ బాబు వెల్లడించారు. అభ్యర్థులు ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకుని, జాబ్ మేళాకు హాజరయ్యే సమయంలో తమ విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, అవసరమైన ఇతర పత్రాలు వెంట తీసుకురావాలని సూచించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నైపుణ్యం పోర్టల్ ద్వారా లేదా పోస్టర్‌లో అందించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సంప్రదించండి: 8688466361, 9390176421, 9966682246, సంప్రదించాలన్నారు..

# పన్నుల వసూళ్ల లక్ష్యాలను చేరుకోవాలి



- నగరపాలక సంస్థ కమిషనర్ వైటి నందన్

**నెల్లూరు, ప్రతినిధి, ఆగస్టు 25, మనసులో మాట:** నగర పరిధిలో ఆర్థిక సంవత్సరం 2026, 27 మొదటి అర్ధ సంవత్సరం ముగింపునకు కేవలం 36 రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున నిర్దేశించిన పన్నుల వసూళ్ల లక్ష్యాలను సిబ్బంది ప్రతి ఒక్కరూ సాధించాలని నగరపాలక సంస్థ కమిషనర్ వైట. నందన్ ఆదేశించారు. వారాంతపు సమీక్షా సమావేశంలో భాగంగా మంగళవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ సిబ్బందితో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో కొత్తగా నిర్మించిన భవనాలు, ఖాళీ స్థలాలు, అదనపు అంతస్తులు నిర్మించిన భవనాలను గుర్తించి పన్నుల పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు తమ పరిధిలోని అడ్మిన్ కార్యదర్శులతో కలిసి ప్రతిరోజూ ఉదయం సచివాలయాల పరిధిలో పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. లోక్ అదాలత్ ద్వారా పన్ను బకాయిదారులకు



నోటీసులు అందించినప్పటికీ ఇప్పటికీ బకాయిలు చెల్లించని వారిపై తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా సిబ్బంది లాగిన్‌లలో ఉన్న వివిధ పౌర సేవల దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిశీలించి, తదుపరి అనుమతుల కోసం సంబంధిత అధికారులకు పంపాలని కమిషనర్ ఆదేశించారు. అడ్మిన్ కార్యదర్శులు ప్రతిరోజూ బకాయిదారులను నేరుగా కలిసి పన్ను బకాయిల వసూళ్లకు చర్యలు చేపడుతున్నారా లేదా అనే అంశాన్ని సంబంధిత రెవెన్యూ ఇన్స్పెక్టర్లు ప్రతిరోజూ పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, టిపిఆర్ఓ వాసుబాబు, రెవెన్యూ అధికారులు సమద్, శ్రీనివాసులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సచివాలయ పరిపాలనా కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మనసులో మాట

# బస్టాండ్‌లో ప్రయాణికుల బ్యాగుల చోరీ

- 46.500 గ్రా. బంగారు ఆభరణాలు స్వాధీనం
- ఇద్దరు మహిళల అరెస్ట్
- కడప చిన్న చౌక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణారెడ్డి వెల్లడి



**కడప, ఆగస్టు 25 (మనసులో మాట):**

కడప ఆర్టీసీ బస్టాండ్‌లో రద్దీని ఆసరాగా చేసుకుని మహిళా ప్రయాణికులను ఏమార్చి వారి బ్యాగుల్లోని బంగారు ఆభరణాలను దొంగిలించిన ఇద్దరు మహిళలను చిన్నచౌక్ పోలీసులు అరెస్ట్ చేసి, సుమారు రూ.5 లక్షల విలువైన 46.500 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి. రామకృష్ణారెడ్డి పాత్రికేయులకు తెలిపారు. కడప జిల్లా ఎస్పీ షేల్కే నచికేత్ విశ్వనాథ్, ఆదేశాల మేరకు, కడప ఇన్‌చార్జ్ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఈ. బాలస్వామిరెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ బి. రామకృష్ణారెడ్డి, సబ్‌ఇన్‌స్పెక్టర్ టి. హరిప్రసాద్, సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిందితులపై నిఘా ఉంచారు. చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్‌లో 14వ వేదిక వద్ద నెల్లూరుకు వెళ్లే బస్సు ఎక్కుతున్న మహిళా ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని వారి లగేజ్ బ్యాగుల జిప్పులు తీసి బంగారు వస్తువులను దొంగిలించిన కేసులో, మంగళవారం బస్టాండ్‌లోని గ్యారేజీ సమీపంలో నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం సిద్దాపురం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి సుశీల, తమ్మిశెట్టి రేణుకలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 46.500 గ్రాముల బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో ఐదు పొరల నల్లపూసల దండ 20 గ్రాములు, మూడు పెద్దవారి బంగారు ఉంగరాలు 5.120 గ్రాములు, బంగారు రాళ్ల నెలవంక 2.040 గ్రాములు, గుండ్ల డిజైన్‌లోని మోహన్‌మాల 15.700 గ్రాములు, రెండు చిన్న పిల్లల బంగారు ఉంగరాలు 1.440 గ్రాములు, ఒక జత బుట్ట కమ్మలు 2.260 గ్రాములు ఉన్నాయని తెలిపారు. దర్యాప్తులో తమ్మిశెట్టి సుశీల, తమ్మిశెట్టి రేణుకలు రాంబాయి అనే మహిళతో కలిసి దొంగతనానికి పాల్పడినట్లు, వీరికి బుజ్జి బాబు అనే వ్యక్తి సహకరిస్తున్నట్లు వెల్లడైందని, మరికొన్ని బంగారు వస్తువులు రాంబాయి వద్ద ఉన్నట్లు, కొన్ని వస్తువులను ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్ సంస్థలో తాకట్టు పెట్టినట్లు నిందితులు తెలిపారని సీఐ తెలిపారు. ఈ కోణంలో సమగ్ర దర్యాప్తు చేసి మిగిలిన బంగారు వస్తువులను రికవరీ చేయాల్సి ఉందన్నారు. కేసును ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన సీఐ, ఎస్ఐ టి. హరిప్రసాద్, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ శివకుమార్, కానిస్టేబుళ్లు ప్రదీప్ కుమార్, ఖాదర్ హుస్సేన్, మాధవరెడ్డి, నాగరాజు, సుధాకర్ యాదవ్, మహిళా సిబ్బంది శ్రీదేవి, మహేశ్వరిలను ఇన్‌చార్జ్ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఈ. బాలస్వామిరెడ్డి అభినందించి రివార్డుల కోసం సిఫార్సు చేసినట్లు తెలిపారు. బస్టాండ్‌లలో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని, బస్సు ఎక్కే సమయంలో రద్దీని ఆసరాగా చేసుకుని దొంగలు తోసుకుంటూ లేదా తొందరపెడుతూ దృష్టి మరల్చి చోరీలకు పాల్పడే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మొబైల్ ఫోన్, పర్స్, నగదు వంటి విలువైన వస్తువులను భద్రంగా ఉంచుకోవాలని, బంగారు ఆభరణాలను వీలైనంత వరకు బయటకు కనిపించకుండా ఉంచాలని, హ్యాండ్‌బ్యాగ్‌లను ముందువైపు పెట్టుకుని పట్టుకోవాలని, వెనుకకు వేలాడదీయకూడదని తెలిపారు. ఎవరైనా కావాలనే తోసినా, తగిలినా లేదా అనవసరంగా మాట్లాడి దృష్టి మరల్చినా అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# ముదిగుబ్బ యువ క్రికెటర్ పల్లా పునీత్ ఠాగూర్ ప్రతిభ



**ముదిగుబ్బ, ఆగస్టు 25: (మనసులో మాట):**

ఉమ్మడి అనంతపురం జిల్లా 14 ఏళ్లలోపు సంభావ్య క్రికెట్ జట్టు ఎంపిక పోటీల్లో ముదిగుబ్బకు చెందిన పల్లా పునీత్ ఠాగూర్ సత్తా చాటాడు. ఆర్డీటీ క్రీడా మైదానంలో జరిగిన మ్యాచ్‌లో పునీత్ ఠాగూర్ ప్రారంభ ఆటగాడిగా బరిలోకి దిగి అద్భుతమైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. బౌండరీలతో కదం తొక్కిన పునీత్ 17 ఫోర్లతో మొత్తం 107 పరుగులు సాధించి శతకం నమోదు చేశాడు. చిన్న వయసులోనే క్రికెట్‌లో ప్రతిభ కనబరుస్తున్న పునీత్ భవిష్యత్తులో మంచి క్రికెటర్‌గా ఎదిగే అవకాశాలు ఉన్నాయని క్రీడాభిమానులు అభిప్రాయపడుతున్నారు. పునీత్ ఠాగూర్ ప్రతిభపై ముదిగుబ్బ ప్రాంతానికి చెందిన క్రికెట్ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ, అతడికి మరింత ప్రోత్సాహం అందించాలని కోరుతున్నారు.

# బీసీల ఆరాధ్య దైవం బీపీ మండల్ బద్వేలులో 108వ జయంతి



**బద్వేలు, మనసులో మాట,ఆగస్టు 25:**

బద్వేలు ఆర్టీసీ ప్రాంగణంలోని మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో బి.పి.మండల్ 108వ జయంతి వేడుకలను మండల్ ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కావేటి రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బద్వేలు గురుమూర్తి మాట్లాడుతూ, వెనుకబడిన వర్గాల అభివృద్ధికి నిస్వార్థంగా పనిచేసిన మహనీయుడు బి.పి. మండల్ అని, బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించినప్పుడే ఆయన ఆశయాలు నెరవేరుతాయన్నారు. నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కొలవలి వేణుగోపాల్, కావేటి రమేష్ యాదవ్ లు మండల్ జీవిత విశేషాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గంటా వెంకటయ్య, ఎస్.ఎ.సత్తార్, అన్వర్ భాషా, సొద్దల పెంచలయ్య, మస్తానయ్య, నరేంద్ర, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి





- వైఎస్ జగన్ మోహన్ రెడ్డి
- ముఖ్య నేతల సమావేశానికి హాజరైన నెల్లూరు జిల్లా నేతలు

**నెల్లూరు, ప్రతినిధి, ఆగస్టు 25, మనసులో మాట:**

స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం పార్టీ ముఖ్య నేతలతో ఆయన సమావేశమై ఎన్నికల సన్నద్ధతపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ మంత్రి డా కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. స్థానిక ఎన్నికల్లో ప్రతి చోటా బలమైన అభ్యర్థులను రంగంలోకి దించాలని జగన్ సూచించారు. ఎక్కడా ఏకగ్రీవ ఎన్నికలకు అవకాశం ఇవ్వకుండా పార్టీ తరఫున పోటీ చేయాలని, అభ్యర్థుల ఎంపికలో అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఏకాభిప్రాయంతో నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో లీగల్ సెల్, మీడియా సెల్, సోషల్ మీడియా విభాగాలను బలోపేతం చేయాలని సూచించారు. గ్రామ, వార్డు స్థాయిలో ఇంటింటా ప్రచారం నిర్వహించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు ప్రస్తుత ప్రభుత్వ పాలనపై పార్టీ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. సెప్టెంబర్ 5 నుంచి 7 వరకు జిల్లా స్థాయి సమావేశాలు, 8 నుంచి 11 వరకు నియోజకవర్గ స్థాయి సమావేశాలు, 12 నుంచి 22 వరకు మండల, వార్డు స్థాయి సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. సెప్టెంబర్ 23 నుంచి ఇంటింటా ప్రచారం ప్రారంభించి పార్టీ రూపొందించిన బుక్‌లెట్లను ప్రజలకు అందించాలని జగన్ సూచించారు. పార్టీ కార్యకర్తల్లో నమ్మకం కల్పిస్తూ, ఎన్నికల కోసం ఇప్పటి నుంచే బలమైన అభ్యర్థులను గుర్తించి సిద్ధం చేయాలని నేతలకు జగన్ పిలుపునిచ్చారు.

మనసులోమాట
KANCHARLA నిజమే మా ఇజం.. ఆదే మా ఆద్యతం.. సంచలన తెలుగు దిన పత్రిక

# శ్రీ తిరుపతి గంగమ్మ గుడి వద్ద అన్నదానం






**పలమనేరు ఆగస్టు 25 (మనసులో మాట):**

పట్టణ సమీపంలోని ఘంటావూరు బీసీ కాలనీలో వెలసి ఉండు శ్రీ తిరుపతి గంగమ్మ దేవస్థానంలో మంగళవారం సాయంకాలం శ్రీ గంగమ్మ గుడి చైర్మన్ స్వర్ణ నంది అవార్డు గ్రహీత డాక్టర్ మురుగన్ ఆధ్వర్యంలో శ్రీ తిరుపతిగంగమ్మ తల్లికి విశేష పుష్పాలంకరణతో పాటు గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. గంగమ్మ తల్లిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలను రాముస్వామి పంచిపెట్టారు. అనంతరం గంగమ్మ దేవాలయం వద్దకు చేరుకున్న భక్తులకు ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# పట్టణ అభివృద్ధికై స్లమ్ ఏరియాల్లో సర్వే




- **సెప్టెంబర్ 28 చలో ఆర్డీఓ - సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్.**

**బద్వేలు, మనసులో మాట,ఆగస్టు 25:**

బద్వేలు స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో మంగళవారం సీపీఎం పట్టణ కమిటీ సమావేశం పి.చాంద్ భాషా అధ్యక్షతన జరిగింది. జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడారు. బద్వేలు జనాభా లక్షా 50 వేలు దాటిందని, వలసలు, ప్లైవుడ్ పరిశ్రమతో స్లమ్ ఏరియాల్లో పేదలు పెరుగుతున్నా మౌలిక సౌకర్యాలు కల్పించడం లేదని విమర్శించారు. ఆగస్టు 28 నుండి సెప్టెంబర్ 28 వరకు మున్సిపాలిటీలో ప్రజా సమస్యలపై సర్వే చేసి, సెప్టెంబర్ 28న "చలో ఆర్డీఓ ఆఫీస్" కార్యక్రమం చేపడతామన్నారు. వామపక్షాల పోరాటంతో వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని, ప్రజల సామాజిక, ఆర్థిక హక్కులను హరిస్తున్నాయని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి కె.శ్రీను, సుబ్బరాయుడు, రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

# పేదలు నివాసమున్న ప్రాంతానికి వర్తించిన సుప్రీంకోర్టు ఉత్తరువు కబ్జాదారులకు వర్తించదా?

- **పేదల కోసం పోరాడిన మాపై కేసులు - కబ్జాదారులతో మీరు లాలూచీలా!**
- **రెవిన్యూ ఇరిగేషన్ అధికారుల అన్నదండలతోనే నాగల చెరువు కబ్జా.**
- **జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్ చంద్రశేఖర్,సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ**

**బద్వేలు , మనసులో మాట, ఆగస్టు 25:**



నాగుల చెరువు ఆక్రమిస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, కబ్జాదారులు ఇస్తున్న మామూళ్ల మత్తులో మునిగితేలుతున్న రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు కళ్ళు తెరవాలని, కోట్ల రూపాయల విలువైన నాగలిచెరువును ఆక్రమిస్తుంటే మీరేం చేస్తున్నారో సమాధానం చెప్పాలని సిపిఐ ఎం ఎం ఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం వారి పార్టీ బృంద సభ్యులతో కలిసి ఆక్రమిత భూములలో ఆయన పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ బద్వేల్ పట్టణంలో నాగల చెరువు ఆక్రమణదారుల చేతుల్లో పడి రోజు రోజుకి కుదించకపోతున్నదని, ఇప్పటికే రెవిన్యూ ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంతో సగానికి పైగా ఆక్రమణలతో నిండిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బద్వేల్ పట్టణంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం వస్తే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని ఆశించిన ప్రజలకు నిరాశ ఎదురైందని వారు ఎద్దేవా చేశారు. పేదలు ప్రభుత్వ స్థలంలో రెండు సెంట్ల స్థలంలో జెండా వాన గాలి నుండి రక్షించుకోవడానికి చిన్నపాటి గుడిసె వేసుకుంటే అప్పటికప్పుడు ఆగమేఘాల మీద ఇక్కడ సుప్రీంకోర్టు ఉత్తర్వుంది మీరు తక్షణమే ఖాళీ చేయాలంటూ కేసులు నమోదు చేసి పోలీసు బలగాలతో వచ్చి పేదలపై దాడి చేసి జైలుకు పంపించిన సుప్రీంకోర్టు ఉత్తరువు నేడు కబ్జాదారులపై పనిచేయదా సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మేము రెవెన్యూ ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుకున్నాము మా




ఇష్టం అంటూ ఇష్టారాజ్యంగా నాగల చెరువును కబలిస్తున్న వారిపై మీరు ఉదాహరణంగా వ్యవహరించడం పలు అనుమానాలను కలిగిస్తున్నదని వీటికి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే నాగర్ చెరువు కుదించకపోయి ఔట్లెట్లు ఆక్రమణకు గురై అనుకున్న రీతిన నీరు రాక రైతులు ఇబ్బంది పడుతున్నారని, మీ యొక్క రెవెన్యూ ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో సరైన సమయంలో నీరు అందక రైతాంగం ఇబ్బంది పడే పరిస్థితి నెలకొన్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కబ్జాదారులు ఇచ్చిన మామూళ్ల మత్తు నుండి మేల్కొని ప్రజల ఇబ్బందుల పట్ల చర్యలు తీసుకుని తక్షణమే కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి నాగల చెరువును కాపాడాలని లేని పక్షంలో రెవెన్యూ ఇరిగేసిన్ అధికారుల అవినీతిని బహిరంగంగా ఎండ కట్టాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి పి చంద్రమోహన్ రాజు, జిల్లా కమిటీ సభ్యులు కే జకరయ్య నియోజకవర్గ కమిటీ సభ్యులు రామరాజు, బాబు, సంజీవ రాయుడు, జయరామ రాజు, నారాయణ, మహబూబ్ బాషా, పోతురాజు రమణ, ఈశ్వర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల సమరానికి వైఎస్సార్‌సీపీ సన్నాహాలు

- **మాజీ ముఖ్యమంత్రి జగన్‌తో కీలక నేతల భేటీ**

**రైల్వే కోడూరు ఆగస్టు 25 మనసులో మాట:**



తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నివాసంలో పలువురు పరామర్శలు, ముఖ్య నాయకుల భేటీలతో రాజకీయ సందడి నెలకొంది. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కోడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలసి వివిధ రాజకీయ అంశాలపై చర్చించారు. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని పార్టీని సమాయత్తం చేయడమే లక్ష్యంగా ఈ సమావేశం సాగింది. గ్రామ స్థాయి నుంచి క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని బలోపేతం చేయడం, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడంపై ఈ భేటీలో అధినేత కీలక సూచనలు చేసినట్లు నాయకులు వివరించారు. రాబోయే ఎన్నికల్లో పూర్తి ప్రజాబలంతో ముందుకు సాగేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా లేదా ఎన్నికల మార్గదర్శకాలకు సంబంధించిన అధికారిక వివరాల కోసం రాజ్యాంగబద్ధమైన సమాచారాన్ని అందించే భారత ఎన్నికల సంఘం లేదా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక పోర్టల్‌స్‌ను పరిశీలించవచ్చు.

మనసులో మాట
KANCHARLA

# "స్పెషల్ టెట్" తో ఒరిగేదేముంది ?




- **40% అర్హత మార్కులతో, ఆఫ్ లైన్ విధానంలో పరీక్ష నిర్వహించాల్సిందే !**
- **యుటిఎఫ్ కడప జిల్లా శాఖ డిమాండ్.**

**బద్వేలు, మనసులో మాట, ఆగస్టు 25:**

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు రాయితీలు లేని అర్హత మార్కులతో, ఆన్లైన్ విధానంతో పరీక్షలు నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన స్పెషల్ టెట్ వల్ల ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు పేర్కొన్నారు. మంగళవారం యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కడపలోని జిల్లా కలెక్టరేట్ వద్ద ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రయోజనం లేని స్పెషల్ టెట్ విధానాన్ని నిరసిస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు 40% అర్హత మార్కులతో, ఆఫ్ లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించాలని, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు చేసిన విజ్ఞప్తిని రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా పాత విధానాన్నే కొనసాగిస్తూ స్పెషల్ టెట్ పేరుతో నోటిఫికేషన్ జారీ చేయడం సహేతుకమైన చర్య కాదన్నారు. స్పెషల్ టెట్ నిర్వహణ విషయంలో ప్రభుత్వ వైఖరి చూస్తే "కొత్త సీసాలో పాత సారా" చందంగా ఉందన్నారు. ఉపాధ్యాయ నియమాకాలకు టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) ఉత్తీర్ణత తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం 2010 సంవత్సరంలో విద్యాహక్కు చట్టాన్ని రూపొందించిందని, ఈ విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 23 (1) కు వివరణ ఇస్తూ చట్టంలో చేర్చిన అంశాల ఆధారంగా ఉపాధ్యాయ నియామకాలకే కాకుండా, సర్వీసులో కొనసాగాలన్నా, పదోన్నతి పొందాలన్నా టెట్ అర్హతను తప్పనిసరి చేస్తూ దేశ సర్వోన్నత న్యాయస్థానం తీర్పునిచ్చిందన్నారు. 2010 సంవత్సరానికి ముందు ఉద్యోగ నియమాకాలు పొందిన ఉపాధ్యాయులందరూ ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలు సాధించి ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చారన్నారు. 30 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకుని, 50 ఏళ్ల వయసు పైబడిన వారే ఎక్కువ మంది ఉన్నారని వారు తెలిపారు. దేశ సర్వోన్నత న్యాయస్థానం తీర్పును సాకుగా చూపి రాష్ట్ర ప్రభుత్వం ఇన్ సర్వీసు ఉపాధ్యాయులు సైతం టెట్ ఉత్తీర్ణత సాధించాల్సిందేనని నిబంధనలు పెట్టి ఉపాధ్యాయుల మెడపై కత్తి వేలాడదీయడం తగదన్నారు. విద్యాహక్కు చట్టం2010 సెక్షన్ 23 (1)కి చట్ట సవరణ చేయడం ద్వారా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించడానికి పాలకవర్గాలు ఏమాత్రం కృషి చేయడం లేదని విమర్శించారు. పరీక్షలలో ఇస్తున్న ప్రశ్నల స్థాయి నోటిఫికేషన్ లో పేర్కొన్న సిలబస్ కంటే పై స్థాయిలో, అత్యంత కఠినంగా ఉంటున్నదన్నారు. దీంతోపాటు ఉపాధ్యాయుల బోధనకు సంబంధం లేని సబ్జెక్టులోని అంశాలపై పరీక్ష రాయాలనటం దుర్మార్గమన్నారు. ఉపాధ్యాయులు ఒకవైపు పాఠశాలల్లో విద్యా బోధన చేస్తూ, మరోవైపు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూ, వయసు రీత్యా వచ్చిన అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటూ టెట్ ఉత్తీర్ణత సాధించడం కష్టతరంగా ఉందన్నారు. ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ టెట్ నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ , అందులో సంఘాలు కోరిన రాయితీలు ఏ ఒక్కటీ లేకపోవడం సరికాదన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు రిజర్వేషన్లతో నిమిత్తం లేకుండా అర్హత మార్కులను 40 శాతంగా నిర్ణయించాలని, ఆఫ్ లైన్ విధానం ద్వారా పరీక్ష నిర్వహించాలని, గణితం మరియు సైన్సు ఉపాధ్యాయులకు వారు బోధిస్తున్న సబ్జెక్టుల లో మాత్రమే పరీక్ష నిర్వహించాలని చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. విద్యాహక్కు చట్టం 23 (1) కి సవరణ చేయడం ద్వారా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపుకు కృషి చేయడానికి కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలనే విజ్ఞప్తిని సైతం రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టడం తగదన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ అసెంబ్లీ తీర్మానం చేసి తమిళనాడు ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల ఆందోళనను పరిగణలోకి తీసుకొని, స్పెషల్ టెట్ లో 40 శాతం అర్హత మార్కులను ప్రవేశపెట్టాలని, ఆఫ్ లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించాలని, టెట్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు విద్యా హక్కు చట్టం 23(1) కి సవరణ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరుబాట పట్టక తప్పదని హెచ్చరించారు. తక్షణం ప్రభుత్వం స్పందించకపోతే 26వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో బైక్ ర్యాలీలు నిర్వహిస్తామని, సెప్టెంబర్ 3వ తేదీ ఛలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వ వైఖరిని ఎండగడతామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వై.రవికుమార్, ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు ఎస్.ఎజాస్ అహ్మద్, జి.గోపీనాథ్, డి.వి.సుబ్బారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.కృష్ణారెడ్డి , జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు రాజశేఖర రాహుల్, సరస్వతి, యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు రామ కేశవ, చెన్నయ్య, హిపాజతుల్లా, కాయపాటి రామాంజనేయులు, నాగేంద్ర, నాగరాజు, గీత తదితరులు పాల్గొన్నారు.

## గొబ్బూరువారిపల్లిలో శోకసంద్రం: నారాయణ పార్థివదేహానికి బత్యాల నివాళి

**రైల్వేకోడూరు ఆగస్టు 25 మనసులో మాట:**

రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం గొబ్బూరువారిపల్లి గ్రామానికి చెందిన అక్కమ్మగారి నారాయణ ఆకస్మిక మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. విషయం తెలుసుకున్న మాజీ శాసనమండలి సభ్యులు బత్యాల చెంగల్రాయుడు వెంటనే గ్రామానికి చేరుకుని నారాయణ భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. నారాయణ మృతి కుటుంబానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ కష్ట సమయంలో పార్టీ పరంగా, వ్యక్తిగతంగా ఎల్లవేళలా అండగా ఉంటామని బత్యాల చెంగల్రాయుడు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల పరిస్థితిని అడిగి తెలుసుకుని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. నారాయణ మృతిపట్ల గ్రామస్తులు, నాయకులు



సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నారాయణ భౌతికకాయానికి నివాళులర్పించారు..

## మద్యానికి బలై 26 ఏళ్ల యువకుడు మృతి



- **మాజీ ప్రభుత్వ సలహాదారు నాగార్జున రెడ్డి ఆవేదన.**

**బద్వేలు, మనసులో మాట,ఆగస్టు 25:**

రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతుందని, యువత బానిసలై ప్రాణాలు కోల్పోతున్నారని మాజీ ప్రభుత్వ సలహాదారు నాగార్జున రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బ్రాందీ షాపులే కాకుండా ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు, హోటళ్లు, కూలింగ్ షాపులు, ధాబాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్నారని, చిన్న వయసులోనే లివర్, కిడ్నీలు పాడై చనిపోతున్నారని అన్నారు. బద్వేలులో నాయబ్ అనే 26 ఏళ్ల యువకుడు మద్యానికి బానిసై చనిపోవడం బాధాకరమన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక తాగుబోతుల సంఖ్య విపరీతంగా పెరిగిందని, మహిళలు గతంలో మాదిరిగా బెల్ట్ షాపులపై ఉద్యమించి తమ కుటుంబాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

## కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి వైద్యాధికారికి వినతి



**బద్వేలు, మనసులో మాట,ఆగస్టు 25:**

వైద్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలంటూ ఏపీ మెడికల్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు వి.మహేంద్ర ఆధ్వర్యంలో తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.రెగ్యులరైజేషన్ అయ్యేవరకు 100% గ్రాస్ వేతనం ఇవ్వాలని, విధి నిర్వహణలో మరణిస్తే కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఈపీఎఫ్, హెల్త్ కార్డు, పూర్తి వేతనంతో సెలవులు, రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్లు కల్పించాలని కోరారు. ఈ అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని వైద్యాధికారి తెలిపారు.

మనసులో మాట

# కనపర్తిలో స్థానిక సంస్థల ఎన్నికలపై అవగాహన



**చెన్నూరు, మనసులో మాట, ఆగస్టు,25:**

జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐ.పి.ఎస్. గారి ఆదేశాల మేరకు, చెన్నూరు సి.ఐ చాంద్ బాషా ఆధ్వర్యంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చెన్నూరు మండలం కనపర్తి గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో ఎలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడవద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని ప్రజలకు స్పష్టంగా సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా సంయమనం పాటించాలని సి.ఐ చాంద్ బాషా సూచించారు.మంగళవారం గ్రామసభ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో ఎలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడవద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని ప్రజలకు స్పష్టంగా సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా సంయమనం పాటించాలని సి.ఐ చాంద్ బాషా సూచించారు.

# అంగన్ వాడీ సిబ్బందికి ఎమ్మెల్యే సోమిరెడ్డి అభినందన



**వెంకటాచలం ఆగస్టు 25 ( మనసులో మాట):** సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలో ఇటీవల అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాలుగా నియమితులైన 36 మంది నియామక ఉత్తర్వులు అందుకుని నెల్లూరు వేదాయపాళెం కార్యాలయంలో మంగళవారం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా నియమితులైన వారికి ఆయ నశుభాకాంక్షలు తెలియజేశారు. అంగన్ వాడీ కేంద్రాల్లో అంకితభావంతో పనిచేసి చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు.



# జనసేన సిద్ధాంత పటిష్టతకు యనమల నిబద్ధతే పునాది: గుర్రంకొండ వంశీ వెల్లడి





**రైల్వే కోడూరు ఆగస్టు 25 మనసులో మాట:**

అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు ప్రాంతంలో జనసేన సిద్ధాంతాలను, ఆశయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో డాక్టర్ యనమల భాస్కర్ పాత్ర ప్రశంసనీయమని ఆ పార్టీ నాయకుడు గుర్రంకొండ వంశీ పేర్కొన్నారు. అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటూ, స్థానిక ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నాయకులలో భాస్కర్ ముందు వరుసలో ఉంటారని కొనియాడారు.రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహరహం శ్రమిస్తున్న భాస్కర్ వ్యక్తిత్వం ఆదర్శనీయమని వంశీ స్పష్టం చేశారు. ఎంతటి ఎత్తుకు ఎదిగినా ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించే ఆయన తత్వం, నియోజకవర్గ ప్రజలతో ఆయనకు ఉన్న ప్రేమానురాగాలను చాటిచెబుతోందన్నారు. ప్రజా క్షేత్రంలో నిరంతరం అందుబాటులో ఉంటూ, నియోజకవర్గ ప్రగతికి పాటుపడుతున్న ఆయన నిజమైన జననాయకుడని అభివర్ణించారు. పార్టీ అధినాయకత్వం అందించిన గుర్తింపుతో స్థానిక సంస్థల ఎన్నికల కమిటీ సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తించడం ఎంతో గౌరవంగా, గర్వకారణంగా ఉందని ఈ సందర్భంగా వంశీ హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో యనమల భాస్కర్ నాయకత్వంలో మరియు సమర్థవంతమైన దిశా నిర్దేశంలో నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం కానుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమం దిశగా రైల్వేకోడూరులో జనసేన నూతన అధ్యాయానికి శ్రీకారం చుడుతుందని, ప్రజా పోరాటాలలో పార్టీ జెండా మరింత ఉత్సాహంతో రెపరెపలాడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# హెచ్.ఐ.వీ పై అవగాహనకు ఎల్ఈడీ ప్రచార రథం ప్రారంభం

**అన్నమయ్య జిల్లా బ్యూరో మనసులో మాట ఆగస్టు 25:**

హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ ప్రచార వాహనాన్ని డీఎల్ఏటీఓ డా. ఎల్. రాధిక, డీసీహెచ్ఎస్ డా. లక్ష్మీ ప్రసాద్ సంయుక్తంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణ, వ్యాధిపై ఉన్న అపోహల తొలగింపు, హెచ్ఐవీ పరీక్షల ప్రాధాన్యత, చికిత్స విధానం, ప్రభుత్వ ఆరోగ్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎల్ఈడీ వాహనం ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు.హెచ్ఐవీ వ్యాప్తికి సంబంధించిన అపోహలను తొలగించడంతో పాటు, హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష



చూపకుండా వారికి సామాజికంగా, మానసికంగా అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.దిశ క్లస్టర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ టి. ఆనంద్ కుమార్ మాట్లాడుతూ హెచ్ఐవీని ముందుగానే గుర్తించి, వైద్యుల సూచనల మేరకు ఏఆర్టీ చికిత్సను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించవచ్చని తెలిపారు.పీసీఎస్ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. చెన్నారెడ్డి మాట్లాడుతూ ఎల్ఈడీ ప్రచార వాహనం ద్వారా హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణ, 959599 లక్ష్యాలు, హెచ్ఐవీ పరీక్షలు, ఏఆర్టీ చికిత్స, సురక్షిత ప్రవర్తన, అందుబాటులో ఉన్న ఆరోగ్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో దిశ క్లస్టర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ టి. ఆనంద్ కుమార్, పీసీఎస్ఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ టి. స్వాతి, పీసీఎస్ఎస్ సిబ్బంది, ఏరియా హాస్పిటల్, ఐసీటీసీ సిబ్బంది, జనచేతన ప్రాజెక్ట్ మేనేజర్, ఎల్‌డబ్ల్యూఎస్ ఆరోగ్య కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వినియోగదారులు సొంత బ్యాగులు తెచ్చుకోవాలి- కమిషనర్

**పలమనేరు ఆగస్టు 25 ( మనసులో మాట):**

పలమనేరు పురపాలక సంఘం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై దుకాణదారులకు మున్సిపల్ అధికారుల విస్తృత అవగాహన కల్పించారు.పలమనేరు పురపాలక సంఘం పరిధిలో పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ పట్టణ సాధనలో భాగంగా ఒకసారి మాత్రమే వాడి పారేసే ప్లాస్టిక్ (సింగిల్ యూజ్ ప్లాస్టిక్) వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ), శానిటరీ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై )వార్డు శానిటరీ సెక్రటరీల బృందం పట్టణంలోని ప్రధాన వాణిజ్య ప్రాంతాలు, కూరగాయల మార్కెట్, కిరాణా దుకాణాలు, హోటళ్లు ఇతర వ్యాపార సముదాయాలను సందర్శించి దుకాణదారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.అవగాహన సదస్సులోని నిషేధిత వస్తువులు 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, ప్లాస్టిక్ కప్పులు, ప్లేట్లు, స్ట్రాలు, థర్మోకోల్ వస్తువులు ప్లాస్టిక్ ఫ్లెక్సీల వినియోగాన్ని తక్షణమే నిలిపివేయాలి.ప్రత్యామ్నాయాల ప్రోత్సాహం: ప్లాస్టిక్‌కు



బదులుగా బట్ట సంచులు (క్లాత్ బ్యాగులు), జనపనార (జూట్) బ్యాగులు, పేపర్ బ్యాగులు అరటి ఆకులు/ఇస్తరాకులు వాడాలని సూచించారు. దుకాణాలకు వచ్చే వినియోగదారులు సొంత సంచులు తెచ్చుకునేలా ప్రోత్సహించాలి.పర్యావరణ హితం: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల డ్రైనేజీలు పూడికపోయి దోమలు వృద్ధి చెందడం, పశువుల ఆరోగ్యం క్షీణించడం నేల సారం తగ్గడం వంటి తీవ్ర నష్టాలు జరుగుతున్నాయని వివరించారు. జరిమానాలు చట్టపరమైన చర్యలు: ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి నిషేధిత ప్లాస్టిక్ వాడినా, విక్రయించినా భారీ జరిమానాలు విధించడంతో పాటు దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. పలమనేరు పట్టణాన్ని "ప్లాస్టిక్ రహిత స్వచ్ఛ పట్టణం"గా తీర్చిదిద్దేందుకు వ్యాపార వర్గాలు, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలందరూ పురపాలక సంఘానికి పూర్తి సహకారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

మనసులో మాట

# ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలి

- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్
- రాయచోటి మార్కెట్ యార్డ్‌లో ఈవీఎం గోదాము తనిఖీ

**రాయచోటి, ఆగస్టు 25 మనసు మాట :**



ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు మాసవారీ తనిఖీల్లో భాగంగా.... మంగళవారం ఉదయం రాయచోటి పట్టణం మార్కెట్ యార్డ్ లో ఉన్న ఈవీఎం గోదామును రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎం గోడౌన్ లో అంతర్భాగాలను రాజకీయ పార్టీల సమక్షంలో గోదాము లోపల భద్రపరిచిన ఆయా ఈవీఎం యంత్రాలు బియులు, సియూలు, వివి ప్యాట్ లను, అక్కడి భద్రతా చర్యలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేశారు. అనంతరం వివిధ అంశాలలో రాజకీయ పార్టీ ప్రతినిధులు అడిగిన సందేహాలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్డిఓ ఏ. శ్రీనివాస్, ఎలక్షన్ విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కమిషన్ చైర్మన్ 27న నెల్లూరు జిల్లా పర్యటన

**నెల్లూరు, ప్రతినిధి, ఆగస్టు 25, మనసులో మాట:**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ ఈ నెల 27న జిల్లాలో పర్యటించనున్నారు. కమిషన్ సభ్యులతో కలిసి ఆయన జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం వెల్లడించారు. ఆగస్టు 27న ఉదయం 10.30 గంటలకు నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజల నుంచి చైర్మన్ కేఎస్ జవహర్ వినతి పత్రాలను స్వీకరించనున్నారు. అనంతరం జిల్లా అధికారులతో పాటు మండల స్థాయి పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ప్రత్యేకంగా షెడ్యూల్డ్ కులాలకు చెందిన ప్రజలు సంక్షేమ పథకాల అమలు, అత్యాచార నిరోధక చట్టాల అమలు, భూ సంబంధిత సమస్యలు, రిజర్వేషన్లు తదితర అంశాలపై తమ ఫిర్యాదులు, వినతిపత్రాలను నేరుగా చైర్మన్‌కు సమర్పించవచ్చని కలెక్టర్ తెలిపారు. అర్హులైన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.

# దేవాలయం భూములు పై ఆరా తీసిన దేవాదాయ శాఖ అధికారులు

**వీరబల్లి ఆగస్టు 25 మనసులో మాట :**



వీరబల్లి మండలంలోని మట్లి పంచాయతీలో మాండవ్య నదిన ఒడ్డున వెలసిన అతి పురాతనమైన శ్రీ కోదండ రామస్వామి ఆలయం యొక్క భూములపై మంగళవారం దేవాదాయ శాఖ అధికారులు ఈవో దేవదాస్ ఆరాదీశారు. ఆయన ఉదయం దేవాలయాన్ని సందర్శించి స్వామి దర్శనం చేసుకుని చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చిన గ్రామస్థులతో దేవాలయం యొక్క భూములను వాటి సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించడం జరిగింది. మట్లి పంచాయతీలో ఈ భూములు కొందరు వ్యక్తుల చేతుల్లో ఉన్నాయని అవి తిరిగి దేవాదాయ శాఖకు అప్పజెప్పాలని మట్లి పెద్దూరు కస్పా కు చెందిన నరేంద్ర నాయుడు అధికారులకు తెలపడం జరిగింది. దాదాపు 400 ఎకరాలు ఈ గుడికి సంబంధించిన భూములు ఉన్నాయని వాటిని తిరిగి దేవాలయానికి అప్పజెప్పాలని ఆయన కోరారు. సంబంధించిన రికార్డులను సర్వే నెంబర్ల ప్రకారం రికార్డులను వెలికి తీసి అధికారులకు చూపించడం జరిగింది. ఆ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆయన కోరారు. క్షుణ్ణంగా రికార్డులను పరిశీలించి ఉన్నతస్థాయి అధికారులకు ఈ సమస్యలను తీసుకెళ్తానని ఈవో తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాకులు అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# పురపాలక ఎన్నికల నేపథ్యంలో సిబ్బందికి దిశానిర్దేశం



- బద్వేలు అర్బన్ సీఐ రామకృష్ణ.

**బద్వేలు, మనసులో మాట,ఆగస్టు 25:**

బద్వేలు వృత్త పర్యవేక్షకుల ఆధ్వర్యంలో మంగళవారం అర్బన్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో మహిళా సహాయ కేంద్రం మరియు పోలీసు స్థావరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రామకృష్ణ మాట్లాడుతూ.. రానున్న పురపాలక ఎన్నికల నేపథ్యంలో చేపట్టాల్సిన ముందు జాగ్రత్త చర్యలు, సిబ్బంది నిర్వహించాల్సిన బాధ్యతలు, ఎన్నికల వేళ పాటించాల్సిన నియమాలపై సూచనలు ఇచ్చారు. అదేవిధంగా సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, విధి నిర్వహణలో ఇబ్బందులపై చర్చించి పరిష్కార మార్గాలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



# లక్ష్మీనారాయణ మృతికి డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి నివాళి



**రామాపురం ఆగస్టు 25 మనసులో మాట :**

రామాపురం మండలం కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ మేదరపల్లెలో మాజీ ఎంపీటీసీ బ్రహ్మయ్య సోదరుడు లక్ష్మీనారాయణ ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన భౌతికకాయాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ,ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. లక్ష్మీనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## గనుల రవాణాను వెంటనే ఆపాలంటూ మట్లి గ్రామస్తులు



**వీరబల్లి ఆగస్టు 25 మనసులో మాట :**

మండల పరిధిలో మట్లి పంచాయతీలో మాండవ్య ఒడ్డున వెలిసిన కోదండ రామస్వామి దేవాలయం వెలిసిన నల్ల గుట్టలో నిలువైన ఉన్నకనులను నల్లరాతిని గత కొన్ని సంవత్సరాల నుండి రాత్రి వేళల్లో తరలించడం జరుగుతున్నది. అయితే గనులు తీయడానికి ఉపయోగించిన నల్లమందు నాట్లు వలన దేవాలయము దెబ్బతింటున్నదని గ్రామస్తులు వాపోతున్నారు. మంగళవారం దేవాలయాన్ని సందర్శించిన దేవాదాయ శాఖ అధికారి అయిన ఈవో దేవదాసు దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లడం జరిగింది. ఇప్పటికే దేవాలయం పది మీటర్ల దూరం సమీపంలో రాలను నాట్లు పెట్టి పేల్చడంతో దేవాలయం పూర్తిగా దెబ్బ తినడమే కాకుండా గోడలు సీలిపోతున్నాయని వీటిని వెంటనే ఆపాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సంబంధించిన కాంట్రాక్టర్ ను ఫోన్లు ద్వారా సమాచారం అడిగి తెలుసుకునగా మాకు మైనింగ్ అధికారులు 20 సంవత్సరాలు లీజుకు ఇచ్చారని అందుకు ప్రభుత్వానికి డబ్బులు చెల్లించడం కూడా జరిగిందని కాంట్రాక్టర్ తెలిపారు. ఆపకపోతే అతి పురాతనమైన దేవాలయం దెబ్బతింటుందని గ్రామస్తులంతా తిరగబడి మైనింగ్ పనులను ఆపడం జరిగింది. అక్కడికి వచ్చిన ప్రజలు ఈ మైనింగ్ పనులు ఆపాలంటూ పంచాయతీ విఆర్ఓ కు రాతపూర్వకంగా రాయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల నిఘా!




- **తప్పిపోయిన 80 ఏళ్ల వృద్ధురాలిని కాపాడిన రాయచోటి పోలీసులు**

**రాయచోటి ఆగస్టు 25 మనసులో మాట :**

రాయచోటిలోని శ్రీ వీరభద్ర స్వామి ఆలయ దర్శనానికి వచ్చి తప్పిపోయిన కర్ణాటకకు చెందిన 80 ఏళ్ల వృద్ధురాలు గుర నింగవను రాయచోటి అర్బన్ పోలీసులు సీసీ కెమెరాల సహాయంతో సురక్షితంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.బాధితుల ఫిర్యాదుతో ఇన్‌స్పెక్టర్ బి.వి. చలపతి ఆదేశాల మేరకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఆపరేటర్ సురేందర్ సీసీ ఫుటేజ్‌ను వేగంగా విశ్లేషించి ఆమె ఆచూకీ కనుగొన్నారు. సమయస్ఫూర్తితో పనిచేసిన సిబ్బందిని ఇన్‌స్పెక్టర్ అభినందించారు. నేరాల నియంత్రణ, భద్రత కోసం ఇళ్లు, వ్యాపార సంస్థల వద్ద నాణ్యమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.అత్యవసర సహాయం, సమాచారం కోసం రాయచోటి పోలీస్ నంబర్లు 9121100559, 9121100560 లను సంప్రదించాలి.అని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# కూటమి పాలనలోనే అభివృద్ధి రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి,ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్

**రాయలసీమ బ్యూరో,, ఆగష్టు 25(మనసులో మాట ):**



కూటమి ప్రభుత్వ పాలనలోనే అన్ని విధాలుగా రాష్ట్రం అభివృది చెందుతుందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ అన్నారు. మంగళవారం కోట మండలంలోని గూడలి గ్రామంలోనీ గిరిజన కాలనీ లో ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. రెండేళ్లలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు ఎమ్మెల్యే తెలియజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ప్రజల మన్ననలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పొందారన్నా రు.ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, పించన్ల పెంపు తదితర వాటిపై ప్రజలకు అవగహన కల్పించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంలో గూడలి పంచాయతీ లో ఎటువంటి అభివృద్ధి జరగలేదు అని తెలిపారు. గ్రామం లో 40 లక్షలతో 4 సీసీ రోడ్లు వేయించాం.2014 నుండి 2019 మధ్య టీడీపీ ప్రభుత్వం లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలో వేసిన సీసీ రోడ్లు వేశారు తప్ప ఒక్క రోడ్డు కూడ గత వైసీపీ ప్రభుత్వంలో వేయలేదు అని తెలిపారు.కూటమి ప్రభుత్వంలోగూడలి పంచాయతీ లో 755 పెన్షన్లు అందిస్తున్నాం.అన్నదాత సుఖీభవ కింద 260 మందికి 7 లక్షల 20 వేలు అందించాం.తల్లికి వందనం 665 మందికి విద్యార్థులకు 86 లక్షలు అందించాం. వెలుగు డిపార్ట్మెంట్ ద్వారా బ్యాంక్ లింకేజ్, వడ్డీలేని రుణాలు ప్రజల ఉన్నతికి వివిధ పథకాలు ద్వారా 9 కోట్ల 50 లక్షల రూపాయలు అందించామని తెలిపారు.ఇరిగేషన్ శాఖ ద్వారా 14 లక్షల పనులు చేసామని గుర్తు చేశారు.ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖ ద్వారా 26 లక్షల పనులు చేసాం,సీఎం ఆర్ ఎఫ్ ద్వారా 22 మందికి 11 లక్షల 27 వేల రూపాయలు అందించామని తెలిపారు.ఈ రెండేళ్లలో పంచాయతీ నందు దాదాపుగా 13 కోట్ల 50 లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి - సంక్షేమంకార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ 2ఏళ్ళ పాలన కూటమి విజయాలు, మరియు అభివృద్ధి కార్యక్రమాలపై కరపత్రాలు పంపిణీ చేయబడ్డాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందాలని ఏమైనా సమస్యలు ఉంటే మాకు తెలియజేయాలని వాటి పరిష్కారానికి సత్వరమే మేము చర్యలు తీసుకుంటామని ప్రజా సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రజలకు ఎమ్మెల్యే వివరించారు. చివరిలో గూడలి గ్రామానికి చెందిన పల్లె మల్లు వెంకట కృష్ణా రెడ్డి టీడీపీ విధేయుడు అని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పలగాటి భాస్కర్ రెడ్డి, నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి,టీడీపీ తిరుపతి పార్లమెంట్ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జలిల్ అహ్మద్, మాజీ టీడీపీ మండల అధ్యక్షులు మద్దాలి సర్వోతమ రెడ్డి, పల్లె మల్లు వెంకట కృష్ణా రెడ్డి, పాదార్తి కోటేశ్వరరెడ్డి, మర్రి ప్రమీల,వాకా విజయ్ భాస్కర్ రెడ్డి, చాపల శ్రీనివాసులు, కొకర్ల మధు యాదవ్,రఘు, రఘు నాథ్, బాలాజీ, చోటా భాయ్, జనసేన చంద్ర, షేక్ షం షూద్దీన్, దార సురేష్, షేక్ నౌషాద్,టీడీపీ నాయుకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ తెలుగుదేశం గూడూరు నియోజకవర్గం లో క్లస్టర్ 8 ప్రథమ స్థానం

**నెల్లూరు జిల్లా బ్యూరో, ఆగష్టు 25(మనసులో మాట ):**




29వ రోజూ విజయవంతంగా కోట మండలంలోని కోస్టల్ ఏరియా లోని క్లస్టర్ 8 లో.. క్లస్టర్ 8 ఇంచార్జి పాదర్తి కోటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో 'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది. దింతో ఇప్పటి వరకు గూడూరు నియోజకవర్గంలోని క్లస్టర్ వారీగా నమోదు శాతన్ని పరిగణలోకి తీసుకోవడం తో క్లస్టర్ 8 పరిధిలో 84.14 శాతం నమోదు కావడం తో గూడూరు నియోజకవర్గం లోనే నెంబర్ 1 స్థానం కైవసం చేసుకొంది.కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ ప్రారంభించిన 'ఇంటింటికీ తెలుగుదేశం - 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం క్లస్టర్ 8 ఇంచార్జి మరియు మాజీ కోట మండల అధ్యక్షులు పాదర్తి కోటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వంజివాక, సిద్దవరం, కర్లపూడి గ్రామ పంచాయతీ లో 'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమం విజయవంతం గా నిర్వహించారు.ఈ సందర్బంగా క్లస్టర్ 8 ఇంచార్జి పాదర్తి కోటేశ్వరరెడ్డి మాట్లాడుతూ..ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం లో భాగంగా పార్టీ శ్రేణులు ప్రతి గడపకూ వెళ్లి, ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటున్నాము . రెండేళ్ల కూటమి పాలనలో రైతులు, మహిళలు, యువత, పేద, మధ్యతరగతి వర్గాలకు అందుతున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను వివరిస్తున్నట్లు తెలిపారు . అదే సమయంలో గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండటం తో ఈ కార్యక్రమం మరింత ఉత్సాహంగా కొనసాగుతోంది. టీడీపీ నాయకులు, కార్యకర్తల తో పాటు ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు . ప్రజా భాగస్వామ్యంతో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం మరింత విస్తృతంగా మారుతోందని ఆయన తెలిపాయి. ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమం లో భాగంగా క్లస్టర్ 8 గూడూరు నియోజకవర్గం లో ప్రథమ స్థానం సాధించడం చాలా సంతోషంగాఉందని కోటేశ్వరరెడ్డి తెలిపారు. ఇందుకు సహకరించిన బూతు ఇంచార్జిలు, టీడీపీ నాయుకులు, కార్యకర్తలు అందరికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్బంగా క్లస్టర్ 8 ఇంచార్జి పాదర్తి కోటేశ్వరరెడ్డి కి ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ తో పాటు కోట మండలం టీడీపీ అధ్యక్షులు పలగాటి భాస్కర్ రెడ్డి టీడీపీ నాయుకులు పలువురు అభినందనలు తెలిపారు.

మనసులో మాట KANCHARLA

# నాలుగేళ్ల బాలుడి ప్రాణాల కోసం.. విద్యార్థులు రూ 65 వేల సహాయం

**మండపేట (మనసులో మాట) ఆగస్టు 25:**

బుడిబుడి అడుగులతో అమ్మానాన్నల ఒడిలో ఆడుకుంటూ, తోటి చిన్నారులతో ఆనందంగా గడపాల్సిన నాలుగేళ్ల వయసు. కానీ విధి ఆ చిన్నారిపై పగబట్టినట్లైంది. రోడ్డు ప్రమాదం రూపంలో వచ్చిన పెను విషాదం ఆ బాలుడిని నెలల తరబడి మంచానికే పరిమితం చేసింది. విధి వక్రీకరించి ప్రాణాలతో బయటపడినా పూర్తిగా కోలుకోని పరిస్థితిలో వైద్యం కొనసాగుతోంది. కన్న కొడుకును ఎలాగైనా కాపాడుకోవాలన్న తపనతో తల్లిదండ్రులు ఉన్నదంతా అమ్ముకున్నారు. అప్పులు చేశారు. ఇప్పటి వరకు సుమారు రూ.25 లక్షలు ఖర్చు చేశారు. అయినా తమ బిడ్డను సాధారణ స్థితికి తీసుకురావాలన్న ఆశను మాత్రం వదులుకోలేదు. మండపేట పట్టణంలోని గొల్లపుంత కాలనీకి చెందిన సాల నాగరాజు, ఆయన భార్య



దంపతులకు శ్రీలక్ష్మీ అనే నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. గతేడాది డిసెంబరులో తల్లిదండ్రులు బాలుడిని ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని పట్టణంలో పనిమీద వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం వెనుక టైర్ ఒక్కసారిగా పేలి పోవడంతో అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ఘటనలో బాలుడు ఎగిరి పడటంతో తలకు, శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలోకి వెళ్లిన చిన్నారిని తల్లిదండ్రులు హుటాహుటిన రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలుడు కోమాలోకి వెళ్లాడని, స్పృహలోకి రావడానికి నెలలు పట్టవచ్చని తెలిపారు. అయినా తల్లిదండ్రులు వెనుకడుగు వేయలేదు. తమ కళ్ల ముందే పెరిగిన బిడ్డను ఎలాగైనా బతికించుకోవాలన్న తపనతో నెలల తరబడి ఆసుపత్రి ఎమర్జెన్సీ వార్డులోనే వైద్యం అందిస్తూ వచ్చారు. చికిత్స కోసం ఇప్పటికే సుమారు రూ.25 లక్షలు ఖర్చు చేశారు. ఉన్న ఆస్తులు అమ్ముకోవడంతో పాటు అప్పులు చేసి మరీ కుమారుడి ప్రాణాలను నిలబెట్టుకునేందుకు పోరాడుతున్నారు. ప్రస్తుతం కూడా బాలుడికి వైద్యం కొనసాగాల్సి ఉండటంతో మరింత ఆర్థిక సాయం అవసరమైంది.

# మొక్కజొన్న బాధిత రైతులకు నష్టపరిహారం అందించాలి.....

- ఏపీ కౌలు రైతు సంఘం డిమాండ్

**చింతలపూడి ( మనసులో మాట) ఆగస్టు 25:**

సిపి స్వీట్ మొక్కజొన్న రైతుల బకాయిలు విడుదల చేయాలి ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంతా.కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లింగపాలెం మండలం బోగోలు గ్రామపంచాయతీ శివారు వెంకటాపురం గ్రామంలో సిపి సీడ్ మొక్కజొన్న వేసిన రైతులు ఆర్గనైజర్ చెప్పిన దానికి పండిన పంటకు చాలా వ్యత్యాసం వచ్చిందని ఆర్గనైజర్ ఎకరానికి నాలుగు టన్నులు పండుతుందని చెప్పగా ఈ సీడ్ అరటను మాత్రమే పండిందని సీడ్ ఆర్గనైజర్ పసుగంటి. వీరభద్రరావు రైతులను మోసగించాడని కొంతమంది రైతులకు టన్నున్నర పండిందని కనీసం వారికి కూడా డబ్బులు ఇవ్వకుండా ఆర్గనైజర్



ఈరోజు రేపు అని గడుపుతున్నాడని సిపి సీడ్ మొక్కజొన్న పొత్తులు విరిసిన కనీసం కూలీలకు డబ్బులు కూడా ఇవ్వలేదని,ఈ విషయంపై చర్య తీసుకోవాలని చింతలపూడి అగ్రికల్చర్ ఏడి సుబ్బారావు కి సిపి సీడ్ మొక్కజొన్న రైతులు వినతిపత్రం సమర్పించారు. సిపి సీడ్ మొక్కజొన్న తో పాటు సింజెంట కంపెనీ ఆర్గనైజర్ మన్నే ప్రసాద్ కూడా రైతులకు ఇవ్వాల్సిన డబ్బులు చాలా ఉన్నాయని అవి కూడా ఇప్పించాలని వీరు ఏడి కి విన్నవించారు.ఈ వినతి పత్రం ఇచ్చిన వారిలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంతా. కృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి తొర్లపాటి.బాబు, ఏపీ రైతు సంఘం నాయకులు తక్కెలపాటి. ప్రసాదరావు, ఆచంట.నాగేశ్వరావు మారిన సతీష్ సిపి సీడ్ మొక్కజొన్న బాధితులు మద్దిపాటి.వెంకటేశ్వరరావు, బొంత.లింగారావు, బొంత. సుధాకర్, బొప్పన. వెంకటేశ్వరరావు, బొంత. బాబురావు తదితరులు ఉన్నారు.

# అఖండ గోదారిని ఆరాధించేలా పుష్కరాలు

**మనసులో మాట రాజమహేంద్రవరం, ఆగస్టు 25 :**

ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక చింతన మమేకమయ్యేలా గోదావరి పుష్కరాలను నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, గోదావరి పవిత్రతకు భంగం వాటిల్లకుండా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలని సూచించారు. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని తెలిపారు. పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా రూ.4,026 కోట్లతో చేపట్టిన 4,932 పనుల పురోగతిపై మంగళవారం సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. పుష్కరాలకు 10నెలల సమయం మాత్రమే ఉన్నందున పనులను వేగంగా ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. ఇప్పటికే రూ.899 కోట్లను ఆర్థిక శాఖ కేటాయించినట్లు అధికారులు తెలిపారు. అవసరమైన నిధుల సమీకరణతో పాటు కేంద్ర సాయం పొందాలని సీఎం సూచించారు. 2015 మహా పుష్కరాల్లో సుమారు 4.86 కోట్ల మంది పుణ్యస్నానాలు చేయగా, 2027లో 8 నుంచి 10 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. రోజుకు కోటి మంది వరకు వచ్చే అవకాశం ఉండటంతో 440 ఘాట్లను సిద్ధం చేస్తున్నా



రు. ఇప్పటికే ఉన్న 259 ఘాట్లను అభివృద్ధి చేయడంతో పాటు 181 కొత్త ఘాట్లను నిర్మించనున్నారు.

**ఆలయాల అనుసంధానంతో టూరిజం సర్క్యూట్**

పిఠాపురం శక్తిపీఠం, నాలుగు పంచారామ క్షేత్రాలు, ద్వారకా తిరుమల, అన్నవరం, వాడపల్లి, అంతర్వేది తదితర ఆలయాలను అనుసంధానిస్తూ టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. పుష్కర భక్తులకు ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలను సందర్శించే అవకాశం కల్పించేందుకు హోమ్‌స్టేలను ప్రోత్సహించాలని, హోటళ్లకు త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. పుష్కర ఘాట్లకు వెళ్లే రహదారులను అభివృద్ధి చేసి ఆరు జిల్లాల్లో రోడ్లపై గుంతలు లేకుండా చూడాలని, వంతెనల సామర్థ్యాన్ని పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. గోదావరిలోకి మురుగునీరు చేరకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



**ఏఐతో రద్దీ నియంత్రణ**

భద్రత, రద్దీ నిర్వహణ కోసం ఏఐ ఆధారిత క్రౌడ్ అనలిటిక్స్, సీసీటీవీ మానిటరింగ్, డ్రోన్ సర్వైలెన్స్, క్యూఆర్ ఆధారిత వాహన గుర్తింపు వంటి సాంకేతికతను వినియోగించనున్నారు. వైద్య సేవల కోసం అంబులెన్స్‌లు, ఫస్ట్‌ఎయిడ్ కేంద్రాలు, మెడికల్ క్యాంపులతో పాటు 30 తాత్కాలిక ఫీల్డ్ ఆస్పత్రులు ఏర్పాటు చేయనున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని 260 గ్రామ పంచాయతీల్లో 50 పంచాయతీలను మోడల్ పుష్కర పంచాయతీలుగా అభివృద్ధి చేయనున్నారు. పుష్కరాలను కాలుష్య రహితంగా నిర్వహించేందుకు 487 గ్రీన్ ఎనర్జీ బస్సులను వినియోగించడంతో పాటు 11 బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నారు. నదిలో భక్తుల భద్రత కోసం 2,697 రెస్క్యూ బోట్లు, 8,955 మంది శిక్షణ పొందిన ఈతగాళ్లను అందుబాటులో ఉంచనున్నారు.

# రేపు మిలద్ ఉన్ నబీ వేడుకలు



- మహనీయ మహా ప్రవక్త ముహమ్మద్ జయంతి....
- మండపేట లో శాంతి ర్యాలీ....

**మండపేట (మనసులో మాట) ఆగస్టు 26:**

మహనీయ మహా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి జయంతి వేడుకలు రేపు బుధవారం ఘనంగా నిర్వహించనున్నారు. మిలాద్ఉన్‌నబీ దయామయ ప్రవక్త జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తారు. మిలాద్ఉన్‌నబీ, ఈద్ఎమిలాద్, మౌలిద్ అని కూడా పిలుస్తారు. ఇస్లాం లో చివరి ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి పుట్టినరోజును పురస్కరించుకుని జరుపుకునే పవిత్ర దినం. ఇస్లామీయ క్యాలెండర్ ప్రకారం మూడవ నెల అయిన రబీఉల్అవ్వల్ నెల 12వ తేదీన ఈ పండుగ జరుపుకుంటారు. ఈ ఏడాది 2026 లో మిలాద్ఉన్‌నబీ ఆగస్టు 26, బుధవారం నాడు వస్తుంది. ఇది 1448 హిజ్రీ సంవత్సరంలో 12 రబీ ఉల్ అవ్వల్. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలుఅధికారిక సెలవు దినంగా ప్రకటించాయి.

# సీనియర్ జర్నలిస్ట్ సంపర శ్రీనివాస్ మృతి

- పలువురి సంతాపం...

**మండపేట (మనసులో మాట) ఆగస్టు 25**

కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామానికి చెందిన సంపర లక్ష్మి నరసింహ భాస్కర్ శ్రీవాసచార్యులు( శ్రీనివాస్) ఆకస్మికంగా మృతి చెందారు. మూడేళ్ల క్రితం ఈయన కి బ్రెయిన్ సర్జరీ చేశారు. అప్పటి నుండి ఇంటి వద్దే ఉంటున్నారు. ఈ నేపద్యంలో ఆరోగ్యం క్షీణించి అంగర లోని



ఆయన స్వగృహం లో మృతి చెందారు. ఈయనకు భార్య వెంకటసూర్య శేష లక్ష్మీ తాయారు,కుమార్డు వాసుదేవ నాగ సాయి సుమంత్ భాస్కర్, కుమార్తె సీతా శ్రీ రమ్య ఉన్నారు. కుమార్తె కు వివాహం అయింది. శ్రీనివాస్ విలువలకు కట్టుబడి జర్నలిజం లో పనిచేశారు. తొలిరోజుల్లో స్థానిక లోకల్ దిన పత్రికలో పని చేశారు. అనంతరం వార్త లో చేశారు. 2002 నుండి కపిలేశ్వరపురం మండల ఆంధ్రజ్యోతి రిపోర్టర్ గా దీర్ఘకాలం పనిచేశారు. తర్వాత ఆంధ్రప్రభ, సాక్షి పత్రికల్లో పనిచేశారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఏపీ యూ డబ్ల్యూ జె రాష్ట్ర ఉపాధ్యక్షులు కే స్వాతి ప్రసాద్, ఏపీ డబ్ల్యూ జె జిల్లా ఉపాధ్యక్షులు కోసూరి అప్పారావు, రామచంద్రాపురం డివిజన్ ఏపీ యుడబ్ల్యూజే అధ్యక్షులు టపా రామకృష్ణ యూనియన్ సీనియర్ నాయకులు ఐ జె యూ మాజీ సభ్యులు సయ్యద్ హుస్సేన్, యూనియన్ నాయకులు యార్లగడ్డ ప్రసాద్,ఆంధ్రజ్యోతి గోపి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.వారి కుటుంబ సభ్యులకు తమ సానుభూతి తెలియజేశారు.


మనసులో మాట

# "వెల్ఫేర్" దగాకోర్

## ఆర్థిక మోసాలే లక్ష్యంగా ఆవిర్భావం

- దొరికిన కాడికి దోచుకో .. దాచుకో లక్ష్యంగా పయనం
- ఖాతాదారులకు కుచ్చుటోపీ .. డైరెక్టర్లకు రాజభోగాలు
- ఆకర్షణీయమైన పథకాలతో అడ్డగోలు దోపిడీ
- విలాసవంతమైన జీవితం .. ఏజెంట్లకు కానరాని వైనం
- అవినీతి, అక్రమం లక్ష్యంగానే వెల్ఫేర్ ఎండి పయనం
- మోత మోగుతున్న కేసులు
- ఈడీ దర్యాప్తుతో వెల్లడైన అవినీతి లీలలు

(మొదటిపేజీ తరువాయి)
సేకరించి మోసానికి పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. ఈ సంస్థలో ప్రధానంగా నకిలీ రియల్ ఎస్టేట్ పథకాలు ప్లాట్ల పేరుతో ప్రజలను మోసం చేసినట్లు గుర్తించారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ వంటి పలు రాష్ట్రాల్లోని మధ్యతరగతి ప్రజలను టార్గెట్ చేసి నిండా ముంచేసినట్లు ఈడీ గుర్తించింది. విశాఖపట్నంలో 'సొంత ఇల్లు హౌస్ ప్లాట్' (Own Your House Plot) ఇస్తామంటూ ఆకర్షణీయమైన మోసపూరిత పథకాలను ప్రవేశపెట్టి అమాయక పెట్టుబడిదారుల నుండి కోట్లాది రూపాయలు వసూలు చేసినట్లు సుస్పష్టం అయింది. పొంజీ/చిట్ ఫండ్ తరహా మోసానికి పాల్పడి, డబ్బులు రెట్టింపు చేస్తామనే ఆశ కల్పించి, కొన్ని పథకాల ద్వారా డిపాజిట్ చేసిన డబ్బును కొద్ది రోజుల్లోనే రెట్టింపు చేస్తామని పెట్టుబడిదారులను నమ్మించారు. ఈడీ దర్యాప్తు ప్రకారం, వీరు పాత పెట్టుబడిదారులకు మెచ్యూరిటీ సొమ్మును చెల్లించడానికి కొత్తగా చేరిన ఇన్వెస్టర్ల నుండి వసూలు చేసిన నిధులను ఉపయోగించారు. వెల్ఫేర్ గ్రూపు ద్వారా సేకరించిన ప్రజల సొమ్మును రియల్ ఎస్టేట్ ల్యాండ్ లావాదేవీలకు ఉపయోగించకుండా, సంస్థ డైరెక్టర్లు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం మరియు లగ్జరీ వస్తువుల కొనుగోలుకు మళ్లించినట్లు నిర్ధారణ అయింది. నిబంధనలకు విరుద్ధంగా షెల్ కంపెనీల ద్వారా మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రజల నుండి అనధికారికంగా సేకరించిన డిపాజిట్ల వివరాలను దాచిపెట్టేందుకు సంస్థ యొక్క ఆర్థిక నివేదికలు మరియు అకౌంట్ బుక్స్‌ను తారుమారు చేసినట్లు తెలుస్తోంది. భూముల రిజిస్ట్రేషన్ల సమయంలో కూడా అసలు విలువను తొక్కిపెట్టి, ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నులను ఎగ్గొట్టేలా అక్రమ లావాదేవీలు జరిపినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భారతదేశంలోని అనేక రాష్ట్రాల్లో వేలాది మంది నుండి వందల కోట్లు వసూలు చేసిన తర్వాత, వీరు ముందస్తు సమాచారం లేకుండా కార్యాలయాలను (బ్రాంచ్‌లను) రాత్రికి రాత్రే మూసివేసి బోర్డు తిప్పేశారు. దీంతో పెట్టుబడిదారులకు అటు ప్లాట్లు రాక, ఇటు డబ్బులు తిరిగి దొరక్క రోడ్డున పడ్డారు. ఈ అక్రమాలపై ఒడిశా ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్, జార్ఖండ్ సీఐడీ మరియు సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ రంగంలోకి దిగి విజయ ప్రసాద్ నివాసాలపై దాడులు నిర్వహించింది. ఈ సోదాలలో భాగంగా రూ. 1.01 కోట్ల నగదు, 6 లగ్జరీ కార్లను సీజ్ చేయడంతో పాటు సంస్థకు చెందిన 182 బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేశారు. వెల్ఫేర్ గ్రూప్ సంస్థకు సంబంధించిన ఆర్థిక అక్రమ లావాదేవీలు మరియు రియల్ ఎస్టేట్ మోసం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చట్టపరంగా కఠినమైన దర్యాప్తు చర్యలను చేపట్టింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద ఆగస్టు 2026లో ఈడీ అధికారిక




ప్రకటన విడుదల చేస్తూ .. తమ సోదాల్లో అక్రమ లావాదేవీలకు సంబంధించిన రూ. 1.01 కోట్ల విలువైన పక్కా నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. వెల్ఫేర్ నిధుల మళ్లింపు ద్వారా కొనుగోలు చేసినట్లు భావిస్తున్న 6 హైఎండ్ లగ్జరీ కార్లను ఈడీ సీజ్ చేసింది. ప్రజల నుండి వసూలు చేసిన సొమ్మును దాచేందుకు మరియు ఇతర లావాదేవీల కోసం ఉపయోగించిన సంస్థ మరియు దాని డైరెక్టర్లకు చెందిన 182 బ్యాంక్ ఖాతాలను ఈడీ తక్షణమే స్తంభింపజేసింది. దీనివల్ల నిధులు మరికొన్ని చోట్లకు చేతులు మారకుండా అడ్డుకట్ట వేసింది. నిందితుల ఆస్తులు, మనీ ట్రయిల్ గుర్తింపు, ఒడిశా క్రైమ్ బ్రాంచ్, జార్ఖండ్ సీఐడీ మరియు సీబీఐ గతంలో నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ లోతైన దర్యాప్తు చేస్తోంది. రూ. 2,000 కోట్లకు పైగా వసూలు చేసిన డిపాజిట్లు ఏ విధంగా మళ్లించబడ్డాయి అనే మనీ ట్రయిల్ (ఆర్థిక మూలాలు) ను తెలుసుకోవడానికి స్వాధీనం చేసుకున్న కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలు మరియు హార్డ్ డిస్క్‌లను ఈడీ క్షుణ్ణంగా విశ్లేషిస్తోంది. బాధిత పెట్టుబడిదారులకు న్యాయం చేసేలా, అక్రమంగా సంపాదించిన ఈ ఆస్తులను ముందస్తుగా అటాచ్ చేసేందుకు ఈడీ తదుపరి చట్టపరమైన ప్రక్రియను వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మళ్ల విజయ ప్రసాద్‌కు చెందిన వెల్ఫేర్ బిల్డింగ్ అండ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై దేశంలోని వివిధ రాష్ట్రాల్లో, పలు ప్రతిష్టాత్మక దర్యాప్తు సంస్థల ద్వారా నమోదైన కోర్టు కేసులు మరియు వాటి ప్రస్తుత స్థితిని పరిశీలిస్తే.. జార్ఖండ్‌లోని సీబీఐ ఆర్థిక నేరాల విభాగం (EOW, Ranchi) మరియు అవినీతి నిరోధక శాఖ (ACB, Dhanbad) సెప్టెంబర్ 13, 2017న వెల్ఫేర్ సంస్థపై ఎఫ్ఐఆర్ (FIR) నమోదు చేసింది. ప్రజల నుండి డిపాజిట్లు వసూలు చేసి మోసం చేయడం (Deposit Mobilisation), నమ్మకద్రోహం (Criminal Breach of Trust) వంటి చట్టవిరుద్ధ చర్యలపై ఈ కేసు నడుస్తోంది. జార్ఖండ్‌లోని కోడెర్మా బ్రాంచ్‌లో పెట్టుబడిదారుల నుండి భారీగా వసూలు చేసిన నిధులను తిరిగి చెల్లించకుండా ఎగ్గొట్టారనే ఆరోపణలపై సీబీఐ ప్రత్యేక కోర్టుల్లో చార్జ్‌షీట్లు మరియు విచారణ ప్రక్రియలు కొనసాగుతున్నాయి. ఒడిశాలో సుమారు రూ. 2 కోట్లకు పైగా నగదు డిపాజిట్లను వసూలు చేసి, బోర్డు తిప్పేసిన కేసులో ఒడిశా క్రైమ్ బ్రాంచ్ (EOW) పోలీసులు మళ్ల విజయ ప్రసాద్‌ను సెప్టెంబర్ 2021లో విశాఖపట్నంలో అరెస్ట్ చేసి, ట్రాన్సిట్ రిమాండ్‌పై ఒడిశాకు తరలించారు. ఈ కేసు ఒడిశా డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణ చట్టం, 2011 (OPID Act, 2011) మరియు ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ స్కీమ్స్ (నిషేధ) చట్టం, 1978 కింద నమోదైంది. ఒడిశాలోని ప్రత్యేక కోర్టుల్లో ఈ కేసు విచారణ దశలో ఉంది. జార్ఖండ్ సీఐడీ మరియు లోకల్ పోలీస్ కేసులు జార్ఖండ్‌లోని చైబాసా వంటి పలు ప్రాంతాల్లో స్థానిక బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు జార్ఖండ్ సీఐడీ మరియు స్థానిక పోలీసులు కంపెనీ డైరెక్టర్లపై ఐపీసీ సెక్షన్లు 420 (చీటింగ్), 406 (నమ్మకద్రోహం), 120బి (క్రిమినల్ ప్లాన్) కింద కేసులు నమోదు చేశారు. ఎన్‌సిఎల్‌టి (NCLT) మరియు రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (RoC) విచారణ జార్ఖండ్ హైకోర్టు ఆదేశాల మేరకు కోల్‌కతా రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (RoC) వెల్ఫేర్ బిల్డింగ్ అండ్ ఎస్టేట్స్ సంస్థపై కంపెనీల చట్టం కింద ప్రత్యేక విచారణ జరిపింది. ఈ సంస్థ అక్రమాలకు పాల్పడిందని తేలడంతో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (NCLT) లో కూడా దీనికి సంబంధించిన కార్పొరేట్ మరియు దివాలా ప్రక్రియల లీగల్ పిటిషన్లు దాఖలయ్యాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ED) మనీలాండరింగ్ కేసు (2026)పైనున్న సీబీఐ, ఒడిశా మరియు జార్ఖండ్ కేసులను (Predicate Offences) ప్రాతిపదికగా తీసుకుని, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ED) మనీలాండరింగ్ నిరోధక చట్టం (PMLA) కింద ఒక సమగ్ర లీగల్ కేసును నమోదు చేసింది. ఆగస్టు 2026 లో జరిపిన సోదాల అనంతరం ఈ కేసు పరిధి మరింత విస్తరించింది. నిందితులపై కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లైంట్ (చార్జ్‌షీట్) దాఖలు చేసేందుకు మరియు సేకరించిన రూ. 2,000 కోట్ల నిధుల మళ్లింపుపై లీగల్ అటాచ్‌మెంట్ ఆర్డర్స్ ఇచ్చేందుకు ఈడీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా, ఈ సంస్థపై ఐదుకు పైగా రాష్ట్రాల్లో క్రిమినల్, సివిల్ మరియు మనీలాండరింగ్ కోణాల్లో వివిధ కోర్టుల్లో సమాంతరంగా విచారణలు నడుస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ కేంద్రంగా వెల్ఫేర్ బాధితులు సరస్వతి వేసిన కేసు, ఆంధ్రప్రదేశ్ లో గుడివాడలో నమోదు చేసిన కేసుతో పాటు వివిధ ప్రాంతాల్లో బాధితులు నమోదు చేసిన కేసులు కూడా కొనసాగుతున్నాయి. ఇంత జరుగుతున్నా తనకు ఏమీ పట్టనట్టు, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న వెల్ఫేర్ ఎమ్డీ మళ్ల విజయ ప్రసాద్, ఆ సంస్థ డైరెక్టర్లపై రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తున్న తీరుపై బాధితులు అగ్రహోదగ్రులు అవుతున్నారు.